




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 234 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 30 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 234 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 30 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ ధోనీలా

# తయారుకావాలి

- వైసీపీ జిల్లా అధ్యక్షులతో పార్టీ అధినేత వైఎస్ జగన్ సమావేశం
- పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రధాన చర్చ
- ప్రతిపక్షంలో చురుకైన పాత్ర పోషించాలని నేతలకు పిలుపు



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత జగన్ పార్టీ పునర్నిర్మాణంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఈరోజు పార్టీ జిల్లా అధ్యక్షులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతిపక్షంగా సమర్థవంతంగా పని చేయాల్సిన తీరుపై ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నాయకుల్లో ఉండే నిజమైన నాయకత్వ ప్రతిభ బయటపడుతుందని అన్నారు. "భారీ లక్ష్యం ఉన్నప్పుడే బ్యాట్స్‌మన్ ప్రతిభ ఏంటో తెలుస్తుంది. అప్పుడే అతడు ప్రజలకు ఇష్టమైన ఆటగాడు అవుతాడు. రాజకీయాల్లో కూడా ఇది అంతే. ప్రతిపక్షంలో మనం చేసే పనుల ద్వారానే మనల్ని మనం నిరూపించుకుంటాం. ప్రజల్లో, పార్టీలో గౌరవం, ఇమేజ్ పెరుగుతాయి. మన పనితీరుతోనే మన్ననలు పొందగలుగుతాం. అందరూ ధోనీలా తయారు కావాలి" అని చెప్పారు. జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణం స్పందించి, బాధితులకు అండగా నిలవాలని జిల్లా అధ్యక్షులకు జగన్ పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక అంశాలపై గట్టిగా పోరాడాలని, పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించాలని స్పష్టం చేశారు. "మనం రాజకీయ నాయకులం. మన జీవితాలను రాజకీయాలకే అంకితం చేశామన్న విషయాన్ని మర్చిపోవద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకూడదు. ప్రతిపక్షంగా మనకు లభించిన అవకాశాలను వృథా చేసుకోకూడదు" అని సూచించారు. జిల్లా స్థాయిలో ప్రజా సంబంధిత అంశాలను సమర్థవంతంగా వెలుగులోకి తీసుకొస్తేనే ప్రజలకు మరింత చేరువ కాగలమని జగన్ అన్నారు. తిరిగి అధికారంలోకి వస్తేనే ప్రజలకు మరింత మంచి చేయగలమని, ఆ తపనతోనే రాజకీయాలు చేస్తున్నామని తెలిపారు. తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ప్రతి ఇంట్లో తన ఫోటో ఉండాలనుకున్నానని, అదే స్ఫూర్తితో జిల్లా అధ్యక్షులు కూడా తమ సేవలతో ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. పార్టీ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కూడా ఈ సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షులకు సూచించారు.

## అలా మాట్లాడితే... పాకిస్థాన్‌కే వెళ్లిపోండి

- పహల్గామ్ దాడి నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం కీలక వ్యాఖ్యలు
- మత ప్రాతిపదిక 26 మందిని చంపినా పాక్‌కు అనుకూలంగా మాట్లాడటం సరికాదన్న పవన్
- అలా మాట్లాడాలనుకుంటే ఆ దేశానికే వెళ్లిపోవాలన్న జనసేనాని
- ఉగ్రవాదం, హింసపై అందరూ ఒకేలా స్పందించాలన్న డిప్యూటీ సీఎం




**పెన్ పవర్ డెస్క్:**పహల్గామ్ ఉగ్రవాద ఘటన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మత ప్రాతిపదిక 26 మందిని చంపినా పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడటం సరికాదన్నారు. అలా మాట్లాడాలనుకుంటే ఆ దేశానికే వెళ్లిపోవాలని జనసేనాని అన్నారు. ఈ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఈరోజు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలులో జనసేన పార్టీ

వివరాలు 2లో..

## నేడు తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు



- మధ్యాహ్నం 1 గంటకు రవీంద్ర భారతిలో సీఎం రేవంత్ రెడ్డి విడుదల
- మార్చి 21 - ఏప్రిల్ 4 వరకు జరిగిన పరీక్షలకు 5 లక్షల మంది విద్యార్థులు హాజరు
- ఈసారి మార్కుల మెమోలో గ్రేడ్‌లతో పాటు సబ్జెక్టుల వారీగా మార్కులు
- కో-కరిక్యులర్ యాక్టివిటీస్‌కు కూడా గ్రేడ్‌లు కేటాయింపు

వివరాలు 2లో..

## రైల్లో పహల్గామ్ టెర్రర్ అటాక్ రీల్ చూస్తున్న వ్యక్తిపై దాడి



- భోపాల్-ఇండోర్ ప్యాసింజర్ రైలులో 23 ఏళ్ల యువకుడిపై దాడి
- పహల్గామ్ ఉగ్రదాడి రీల్స్ చూడటమే ఘర్షణకు కారణమని ఆరోపణ
- ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులపై ప్రభుత్వ రైల్వే పోలీసుల (జీఆర్పీ) కేసు
- బాధితుడి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు
- నిందితులు ఇండోర్ వాసులుగా అనుమానం, సీసీటీవీ ఆధారంగా దర్యాప్తు

వివరాలు 2లో..

## పాకిస్థాన్ ను నాలుగు ముక్కలు చేయాలి

### సుబ్రహ్మణ్యస్వామి సంచలన ట్వీట్



- పాకిస్థాన్ ను విచ్ఛిన్నం చేయాలన్న సుబ్రహ్మణ్యస్వామి
- బలూచిస్థాన్, సింధ్, పఖ్తూనిస్థాన్ స్వతంత్ర దేశాలుగా ఏర్పడాలని వ్యాఖ్య
- పశ్చిమ పంజాబ్‌ను 'బకిస్థాన్'గా పేర్కొన్న స్వామి

వివరాలు 2లో..

**పెన్ పవర్ డెస్క్:**బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణ్యస్వామి చేసిన ఓ ట్వీట్ ప్రస్తుతం రాజకీయ, దౌత్య వర్గాల్లో తీవ్ర చర్చకు కారణమైంది. పాకిస్థాన్ ను విచ్ఛిన్నం చేసి,

## నేడు విజయవాడకు వెళుతున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- టీడీపీ నేత దేవినేని ఉమా కుమారుడి వివాహ వేడుకకు వెళ్లనున్న రేవంత్
- గత వారం రేవంత్ నివాసానికి వెళ్లి పెళ్లికి ఆహ్వానించిన దేవినేని ఉమా
- వివాహ వేడుకలో చంద్రబాబును రేవంత్ కలిసే అవకాశం



**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఏపీలో పర్యటించనున్నారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా కుమారుడి వివాహ వేడుకలో పాల్గొనేందుకు ఆయన బెజవాడకు

వివరాలు 2లో..

## మధుసూదన్ భార్య ఆ దాడిని వివరిస్తుంటే తట్టుకోలేకపోయాము

- ఇటీవల జమ్మూకశ్మీర్ లోని పహల్గామ్ లో ఉగ్రదాడి
- కావలికి చెందిన జనసేన సభ్యుడు సోమిశెట్టి మధుసూదన్ మృతి
- నివాళి కార్యక్రమం నిర్వహించిన జనసేన హైకమాండ్
- పాల్గొన్న పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్



**పెన్ పవర్ డెస్క్:**జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు సోమిశెట్టి మధుసూదన్ రావుకు జనసేన అగ్రనేతలు

వివరాలు 2లో..

## పెగాసస్ నివేదికపై సుప్రీం కీలక వ్యాఖ్య..

# దేశ భద్రతే ముఖ్యమని వెల్లడి

- నివేదికను బహిర్గతం చేయబోమని స్పష్టం చేసిన అత్యున్నత న్యాయస్థానం
- నివేదికను వీధి చర్చల అంశంగా మార్చకూడదని ధర్మాసనం వ్యాఖ్య
- వ్యక్తిగత గోప్యతా ఉల్లంఘన ఆందోళనలను పరిశీలించే అవకాశం ఉందని సూచన
- జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం విచారణ

వివరాలు 2లో..



**పెన్ పవర్ డెస్క్:** పెగాసస్ స్పైవేర్ వివాదంపై సాంకేతిక కమిటీ సమర్పించిన నివేదికను బహిర్గతం చేయలేమని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. దేశ భద్రత, సార్వభౌమాధికారానికి సంబంధించిన సున్నితమైన అంశాలున్నందున ఈ నివేదికను బయటపెట్టలేమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దేశ భద్రతకు సంబంధించిన నివేదికలోని అంశాలను బహిరంగ చర్చకు పెట్టడం సరికాదని ధర్మాసనం

## వైఎస్ అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ పై విచారణను వాయిదా వేసిన సుప్రీంకోర్టు

- వివేకా హత్య కేసులో ముందస్తు బెయిల్ పై ఉన్న అవినాశ్ రెడ్డి
- బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్
- తదుపరి విచారణను జులై చివరకు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



**పెన్ పవర్ డెస్క్:** వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి మంజూరైన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ విచారణ జరిగింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌కు కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని అవినాశ్ రెడ్డి తరపు న్యాయవాదులు సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ అభ్యర్థనపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. కౌంటర్ దాఖలుకు

వివరాలు 2లో..

## కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీపి కబురు చెప్పిన ఏపీ ప్రభుత్వం

- ఏపీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్ ఏడాది పొడిగింపు
- 2026 మార్చి 30 వరకు కొనసాగింపునకు ప్రభుత్వం నిర్ణయం
- ఆర్థిక శాఖ అనుమతితో నియామకం అయిన వారికే వర్తింపు

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవా కాలాన్ని మరో సంవత్సరం పాటు పొడిగిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, జిల్లా కార్యాలయాల్లో పనిచేస్తున్న అనేక మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల పదవీకాలం ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో, వారి సర్వీసులను 2026 మార్చి 30వ తేదీ వరకు కొనసాగించాలని

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# చాణక్యనీతి: మంచిగా బతకాలంటే ఇవి త్యాగం చేయాల్సిందే..!

ఆచార్య చాణక్యుడు తన తెలివితేటలు ... పాండిత్యం తో శక్తివంతమైన సామ్రాజ్యాన్ని స్థాపించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆయనకు రాజకీయాలతో పాటు ఇతర అంశాలపై పట్టు ఉండేది. చాణక్య నీతిలో అనేక అంశాలు ఉన్నాయి. చాణక్య నీతి నాల్గవ అధ్యాయంలో మంచిగా జీవించాలంటే మానవుడు ఏమేమి త్యాగం చేయాలో వివరించారు. ఇప్పుడు వాటి గురించి తెలుసుకుందాం. .

ఆచార్య చాణక్య గొప్ప తన నీతి శాస్త్రంలో జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. చాణక్య తెలిపిన జీవన విధానాలను అవలంబించడం ద్వారా ఎవరైనాసరే తమ జీవితాన్ని సరళంగా తేలికగా మార్చుకోగలుగుతారు. అందుకే చాణక్య అందించిన నీతి సూత్రాలు నేటికీ అనుసరణీయంగా ఉన్నాయి. చాణక్య తెలిపిన విధానాలు కొంతవరకూ కఠినంగా అనిపించినప్పటికీ వీటిని జీవితంలో అమలుచేస్తే సంతోషకరమైన జీవితాన్ని అందుకోవచ్చు. జీవితంలో విజయం సాధించాలంటే ఎటువంటి లక్షణాలు కలిగివుండాలో ఆచార్య చాణక్యుడు తెలియజేశారు.

**త్యజేద్ధర్మ దయాహీనాం విద్యాహీనాం గురు త్యజేత ?**
**త్యజేత్క్రోధముఖీ భార్యా నిఃస్నేహాన్బన్ధ్వాంస్త్యజేత్?**

ఈ శ్లోకం ప్రకారం, మతంలో కరుణ లేకపోతే .. గురువుకు జ్ఞానం లేకపోతే.. అటువంటి వారిని విడిచిపెట్టడం సముచితం. ఈ శ్లోకం కోపంగా ఉన్న స్త్రీని మరియు అనురాగం లేని బంధువులను కూడా వదిలివేయాలని చెబుతుంది. ఆచార్య చాణక్యుడు త్యాగం ప్రాముఖ్యతను వివరించాడు. మానవుడు తన జీవితంలో కొన్ని విషయాలను వదులుకోవడం మంచిది. అలా వదులుకోకపోతే అవి హాని మాత్రమే కలుగజేస్తాయని చాణక్యుడు నాల్గవ అధ్యాయంలో వివరించారు. చాణక్య నీతిలో విద్య ఎంతముఖ్యమో వివరించారు. చాణక్య నీతి ప్రకారం..గురువు పాత్ర గురించి వివరిస్తూ.. జ్ఞానం లేని గురువును వదిలివేయాలని, లేకుంటే నష్టం కలుగుతుందని చాణక్యుడు వివరించాడు. గురువుతో గొడవలు వద్దు. ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం. ఒక మంచి ఉపాధ్యాయుడు వ్యక్తి జీవితంలో మార్గదర్శి అవుతారు. అయితే కొందరు మాత్రం కోపంతో గురుదేవుడుని కించ పరిచేలా మాట్లాడుతూ వారి గురించి చెడుగా మాట్లాడానికి కూడా వెనుకాడరు. ఇలా చేయడం ద్వారా మీరు గురువును మాత్రమే కాదు జ్ఞానానికి కూడా దూరం అవుతారు.

కో పం విషయంలో ...కోపానికి దూరంగా ఉండాలి. కోపం వ్యక్తిని నాశనం చేస్తుంది . అతని జీవితంలో ఆనందం .. శాంతి లేకుండా చేస్తుంది . కోపం మనిషిలోని ఒక స్వభావం. స్త్రీ, పురుషులు, చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ కోపం వస్తుంది. అయితే చాలా సార్లు కోపం సమయం సందర్భంలో పని లేకుండా అనుకోకుండా వస్తుంది. అలా అదుపు లేకుండా వచ్చే కోపం వలన అనర్థం కలుగుతుందని చాణుక్యుడు చెబుతున్నారు. అంతేకాదు కోపంలో అవతలి వ్యక్తి ఎవరనేది పట్టించుకోకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడానికి కూడా మనిషి వెనుకాడడు. కొంచెం సేపటి తర్వాత కోపం అదుపులోకి వచ్చాక. అయ్యో నేను అలా అనకుండా ఉండాల్సింది. లేకపోతే అలా చేయకుండా ఉండాల్సింది అంటూ చింతిస్తూ ఉంటారు. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ఆచార్య చాణక్యుడి విధానాలను ఆచరించడం ఉత్తమ మార్గమని పెద్దలు చెప్పారు. చాణక్య విధానం ప్రకారం ఎంత కోపం వచ్చినా కొంతమందితో ఎప్పుడూ గొడవ పడకండి. లేకపోతే భవిష్యత్తులో ఇబ్బందులను ఎదుర్కోవలసి ఉంటుంది.

ప్రతి వ్యక్తి కుటుంబ సభ్యులకు.. బంధువులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తాడు. బంధువులు మిమ్మలను ప్రేమించకపోతే చాణక్యుడు తెలిపిన నీతి సూత్రాల ప్రకారం వారికి దూరంగా ఉండండి. వారితో స్నేహాన్ని తగ్గించుకోవడం చాలా మంచిదని చెప్పారు. ఇక కుటుంబ సభ్యుల విషయంలో .. వారితో గొడవ పడకండి. చాణక్య విధానం ప్రకారం మన కుటుంబ సభ్యులపై ప్రతి చిన్న విషయానికి కోపాన్ని చూపించకూడదు. మీ మంచి చెడులను అర్థం చేసుకునేది అవసరానికి అండగా ఉండేది కుటుంబమే. అటువంటి పరిస్థితిలో కుటుంబ సభ్యులతో గొడవ పడటం మీ శ్రేయోభిలాషులను కోల్పోవడంతో ఇబ్బందులు పడతారు. ఒకొక్కసారి మీరు పశ్చాత్తాపడే పరిస్థితులు రావచ్చు .. అంతే కాక భవిష్యత్తులో మీకు సరైన మార్గాన్ని చూపే కుటుంబ సభ్యులు కూడా దూరం అయ్యే అవకాశం ఉంది. చాణక్య నీతి ప్రకారం ప్రతి వ్యక్తి జీవితంలో లక్ష్యాన్ని కలిగి ఉండాలి. దీని వలన ఏకాగ్రత.. ప్రేరణ ఉంటాయి. సహనం కోల్పోకుండా ఉండటంతో శత్రువులు పడతారు. మిమ్మల్ని ప్రోత్సహించి.. మీకు అండగా ఉండే వ్యక్తులతో స్నేహం చేయడం చాలా మంచిది.ఒకే విధమైన విలువలు, లక్ష్యాలను పంచుకునే వ్యక్తులతో పరిచయం మంచిదని చాణక్యనీతి ద్వారా తెలుస్తోంది.

# నేడు తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి పరీక్ష ఫలితాలు రేపు (బుధవారం) విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో విడుదల చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు సుమారు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఇప్పటికే జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ పూర్తి కావడం, నూతన విధానంలో మార్కుల మెమోల జారీపై స్పష్టత రావడంతో ఫలితాల విడుదలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**మార్కుల మెమోలో మార్పులు**

ఈ సంవత్సరం నుంచి పదో తరగతి మార్కుల మెమోల విధానంలో ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన మార్పులు చేసింది. గతంలో కేవలం సబ్జెక్టుల వారీగా గ్రేడ్లు, సీజీపీఏ మాత్రమే ఇచ్చేవారు. అయితే, ఇక నుంచి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్ మార్కులను విడివిడిగా చూపించడంతో పాటు, మొత్తం మార్కులు, గ్రేడ్‌లను కూడా మెమోలో పొందుపరచనున్నారు. అలాగే, విద్యార్థి ఉత్తీర్ణత (పాస్/ఫెయిల్) వివరాలను కూడా స్పష్టంగా పేర్కొంటారు. బోధనేతర కార్యక్రమాల్లో (కో-కరిక్యులర్ యాక్టివిటీస్) విద్యార్థుల ప్రతిభకు కూడా గ్రేడ్లు ఇవ్వనున్నారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ వంటి నాలుగు విభాగాలకు సంబంధించిన గ్రేడ్లను కూడా మార్కుల మెమోలో ముద్రించనున్నట్లు అధికారులు తెలిపారు.

# రైల్లో పహల్గామ్ టెర్రర్ అటాక్ రీల్ చూస్తున్న వ్యక్తిపై దాడి

**పెన్ పవర్ డెస్క్:**భోపాల్ నుంచి ఇండోర్ వెళుతున్న ప్యాసింజర్ రైలులో ఓ యువకుడిపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మొబైల్ ఫోన్‌లో పహల్గామ్ ఉగ్రదాడికి సంబంధించిన రీల్స్ చూస్తున్నాడనే కారణంతో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తనపై దాడి చేసి, దూషించారని 23 ఏళ్ల బాధితుడు ఆరోపించాడు. ఈ మేరకు ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జీఆర్పీ టీఐ రష్మీ పాటిదార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులపై బీఎన్ఎస్ సెక్షన్లు 118(1) (ప్రమాదకర ఆయుధాలతో ఉద్దేశపూర్వకంగా గాయపరచడం), 296 (దూషించడం), 351 (నేరపూరిత బెదిరింపు) తదితర సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాధితుడికి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఘటనకు సంబంధించిన వీడియో, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆమె వివరించారు.

బాధితుడి కథనం ప్రకారం, శనివారం రాత్రి అతను షుజాల్‌పూర్ నుంచి భోపాల్-ఇండోర్ ప్యాసింజర్ రైలు ఎక్కాడు. రైలు దేవాస్ స్టేషన్ దాటిన తర్వాత, ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తన వద్దకు వచ్చి, పహల్గామ్ ఉగ్రదాడికి సంబంధించిన రీల్స్ చూడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. రీల్స్ చూస్తూ తమ వైపు చూస్తున్నావని, రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నావని ఆ ఇద్దరు తనతో వాగ్వాదానికి దిగినట్లు తెలిపాడు.“ఈ క్రమంలోనే వారి మధ్య గొడవ జరిగి అది దాడికి దారితీసింది” అని పోలీస్ అధికారి తెలిపారు. నిందితులు తమది ఇండోర్‌లోని చందన్ నగర్ ప్రాంతమని చెప్పినట్లు బాధితుడు పేర్కొన్నాడని ఆమె అన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని అధికారి రష్మీ పాటిదార్ ధృవీకరించారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీపి కబురు చెప్పిన ఏపీ ప్రభుత్వం

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేశారు.అయితే, ఈ సేవల పొడిగింపునకు ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిబంధనను చేర్చింది. గతంలో ఆర్థిక శాఖ ముందస్తు అనుమతితో నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే ఈ పొడిగింపు ప్రయోజనం వర్తిస్తుందని ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిబంధన పరిధిలోకి రాని వారికి ఈ పొడిగింపు వర్తించదు. అంతేకాకుండా, భవిష్యత్తులో కొత్తగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకోవాలంటే, తప్పనిసరిగా ముందుగా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా కొత్త కాంట్రాక్ట్ నియామకాలు చేపట్టరాదని తెలిపింది.

# అలా మాట్లాడితే... పాకిస్థాన్‌కే వెళ్లిపోండి

- మొదటి పేజీ తరువాయి

నివాళుల కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... ఉగ్రవాదం, హింసపై అందరూ ఒకేలా స్పందించాలని అన్నారు. ఇలాంటి విషయాలపై ఓట్లు, సీట్ల కోసం మాట్లాడకూడదని తెలిపారు. ఉగ్రఘటనలో జనసేన ఓ కార్యకర్తను కోల్పోయిందని పవన్ గుర్తుచేశారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా కావలికి చెందిన మధుసూదన్‌రావు ఫ్యామిలీకి పార్టీ తరఫున రూ. 50లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. “చనిపోయిన మధుసూదన్‌రావు ఎవరికి హాని చేశారు. కుటుంబాన్ని తీసుకుని కశ్మీర్‌కు వెళ్తే చంపేశారు. కశ్మీర్ మనది కాబట్టే అక్కడికి వెళ్లామని మధు భార్య చెప్పారు. హిందువులకు ఉన్న దేశం ఇదొక్కటే. ఇక్కడ కూడా ఉండొద్దంటే ఎక్కడికి పోవాలి. మత కలహాలు సృష్టించేవారి పట్ల అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలి. యుద్ధ పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలి” అని పవన్ కల్యాణ్ అన్నారు.

# నేడు విజయవాడకు వెళుతున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- మొదటి పేజీ తరువాయి

వెళ్లనున్నా రు. ఉదయం 9.15 గంటలకు రేవంత్ రెడ్డి బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరుతారు. ఉదయం 10.40 గంటలకు విజయవాడ సమీపంలోని కానూరులో ఉన్న ధనేకుల ఇంజనీరింగ్ కాలేజ్ ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో ఉదయం 10.50 గంటల నుంచి 11.30 గంటల వరకు జరిగే వివాహ వేడుకలో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం విజయవాడ నుంచి తిరుగుపయనమవుతారు. మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ చేరుకుంటారు. గత వారం దేవినేని ఉమా హైదరాబాద్‌లో రేవంత్ రెడ్డిని కలిసి, తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. పెళ్లికి తప్పకుండా హాజరు కావాలని ఆయన సీఎంను ఆహ్వానించారు. గతంలో రేవంత్ రెడ్డి టీడీపీలో ఉన్నప్పుడు దేవినేని ఉమాతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. పార్టీలు మారినప్పటికీ వారి మధ్య స్నేహ బంధం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే మిత్రుడి ఆహ్వానం మేరకు రేవంత్ రెడ్డి ఈ వివాహానికి హాజరవుతున్నారు.మరోవైపు, ఈ వివాహ వేడుకకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా హాజరవనున్నారు. ఈ క్రమంలో ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకే వేదికపై కలుసుకునే అవకాశం ఉంది.

# పాకిస్థాన్ ను నాలుగు ముక్కలు చేయాలి

- మొదటి పేజీ తరువాయి

నాలుగు ప్రాంతా లుగా విభజించాలంటూ ఆయన చేసిన సూచన ప్రకంపనలు సృష్టిస్తోంది. “పాకిస్థాన్ ను విచ్ఛిన్నం చేయడమే మన దీర్ఘకాలిక లక్ష్యం” అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. పాకిస్తాన్‌లోని బలూచిస్థాన్, సింధ్, పఖ్తూనిస్థాన్ ప్రాంతాలు విడిపోయి స్వతంత్ర దేశాలుగా ఏర్పడాలని ఆయన అన్నారు. పాక్ లోని పశ్చిమ పంజాబ్ ప్రాంతాన్ని వ్యంగ్యంగా ‘బకిస్థాన్’ అని సంబోధిస్తూ, దానిని శత్రువుగా చూడాలని అభిప్రాయపడ్డారు. ఈ ట్వీట్ ద్వారా, పాకిస్థాన్ లోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న వేర్పాటువాద ఉద్యమాలకు స్వామి పరోక్షంగా మద్దతు ప్రకటిస్తున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా బలూచిస్థాన్, సింధ్, పఖ్తూనిస్థాన్ లలో దశాబ్దాలుగా స్వాతంత్ర్య ఆకాంక్షలు, అసంతృప్తి కొనసాగుతున్న నేపథ్యంలో స్వామి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. బలూచిస్థాన్ ప్రాంతానికి చెందిన బలోచ్ లిబరేషన్ ఆర్మీ వంటి సంస్థలు పాక్ ప్రభుత్వంతో పోరాడుతున్న విషయం తెలిసిందే. ఇదే తరహా అభిప్రాయాలను గతంలో ఇతర బీజేపీ నేతలు కూడా వ్యక్తం చేశారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఇటీవల మాట్లాడుతూ, బలూచిస్థాన్ స్వాతంత్ర్య ఉద్యమం కారణంగా పాకిస్థాన్ నుంచి విడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే కూడా 2025 నాటికి పాకిస్తాన్ మూడు ముక్కలవుతుందని (బలూచిస్థాన్, పఖ్తూనిస్థాన్, పంజాబ్) అభిప్రాయపడ్డారు. స్వామి తాజా ట్వీట్ ఈ చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

# వైఎస్ అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ పై విచారణను వాయిదా వేసిన సుప్రీంకోర్టు

- మొదటి పేజీ తరువాయి

సమయం ఇస్తూ, తదుపరి విచారణను జులై చివరి వారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. అయితే, అప్పటికి తన పదవీకాలం ముగియనున్నందున, ఈ కేసు విచారణను వేరొక ధర్మాసనానికి బదిలీ చేసే అవకాశం ఉందని జస్టిస్ ఖన్నా సూచనప్రాయంగా తెలిపారు. విచారణ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన తాజా దర్యాప్తు నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. సీబీఐ అధికారి రాంసింగ్‌తో పాటు వివేకా కుమార్తె సునీతారెడ్డి, ఆమె భర్తపై గతంలో నమోదైన కేసు పూర్తిగా కక్షసాధింపు చర్య అని ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. ఇద్దరు పోలీసు అధికారులను అడ్డం పెట్టుకుని ఎంపీ అవినాశ్ రెడ్డే ఈ కేసును బనాయించారని ఆరోపించింది. అవినాశ్ రెడ్డి బెయిల్‌పై బయట ఉంటే సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్షులను ప్రభావితం చేయడం లేదా బెదిరించడం వంటివి చేస్తారనడానికి ఈ ఘటనే నిదర్శనమని ప్రభుత్వం తరపు న్యాయవాదితో పాటు, సునీత తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించారు. అందువల్ల అవినాశ్ రెడ్డి బెయిల్‌ను తక్షణమే రద్దు చేయాలని వారు కోర్టును అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం, విచారణను వాయిదా వేసింది.

# పాకిస్థాన్ జిందాబాద్ అన్నాడు... అక్కడిక్కటే కొట్టి చంపారు!

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ అంటే ప్రజలు ఎలా మండిపడుతున్నారో చెప్పే ఘటన కర్ణాటకలోని మంగళూరులో చోటుచేసుకుంది. స్థానికంగా జరిగిన ఓ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ‘పాకిస్తాన్ జిందాబాద్’ అంటూ నినాదాలు చేశాడన్న కారణంతో ఓ వ్యక్తిపై కొందరు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ప్రధాన నిందితుడితో సహా పది మందికి పైగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ ముమ్మరం చేశారు. మంగళూరు శివార్లలోని కుడుపు గ్రామంలో భట్ర కల్లూర్తి ఆలయం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. అక్కడ జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో మృతుడికి, సచిన్ అనే మరో వ్యక్తికి మధ్య మొదట వాగ్వాదం చోటుచేసుకుంది. అది తీవ్ర ఘర్షణగా మారి, కొందరు గుంపుగా చేరి బాధితుడిపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి, కాళ్లతో తన్నారు. సాయంత్రం ఆలయ సమీపంలో బాధితుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనను కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వర ధృవీకరించారు. క్రికెట్ మ్యాచ్‌లో ‘పాకిస్తాన్ జిందాబాద్’ అని అరిచినందుకు కొందరు దాడి చేశారని, బాధితుడు తర్వాత మరణించాడని ప్రాథమిక సమాచారం ఉందన్నారు. 10-12 మందిని అరెస్టు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని ఆయన తెలిపారు. మంగళూరు పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ మాట్లాడుతూ, పోస్టుమార్టంలో తీవ్ర గాయాల వల్లే మృతి చెందినట్లు నిర్ధారణ అయిందన్నారు. వెన్నుపై పదేపదే కొట్టడం వల్ల అంతర్గత రక్తస్రావం, షాక్‌తో మరణించినట్లు నివేదిక వెల్లడించిందని తెలిపారు. ప్రధాన నిందితుడైన సచిన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఐదుగురి కంటే ఎక్కువ మంది నేరంలో పాల్గొనడంతో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కఠిన సెక్షన్లు నమోదు చేశామని, దీని కింద జీవిత ఖైదు లేదా మరణశిక్ష పడే అవకాశం ఉందని వివరించారు. స్థానికుడి ఫిర్యాదు మేరకు 19 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ డేటా ఆధారంగా పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

# మధుసూదన్ భార్య ఆ దాడిని వివరిస్తుంటే తట్టుకోలేకపోయాము

- మొదటి పేజీ తరువాయి

ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్ర మంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ, పహల్గామ్ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.సామాన్య అరటి పండ్ల వ్యాపారి కుటుంబంలో పుట్టి, కష్టపడి చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా మంచి జీవితం గడుపుతున్న మధుసూదన్ రావు ఉగ్రవాదుల దాడిలో మరణించడం అత్యంత బాధాకరమని న్నారు. దాడి జరిగిన తీరును ఆయన భార్య వివరిస్తుంటే తట్టుకోలేకపోయానని ఆవేదన చెందారు.ఈ ఘటన జరిగిన వెంటనే పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు మూడు రోజుల

పాటు సంతాప దినాలుగా ప్రకటించామని నాదెండ్ల తెలిపారు. మృతుడి ఆత్మశాంతికి వివిధ కార్యక్రమాల ద్వారా నివాళులర్పించామని, భారతీయుల ఐక్యతను చాటేందుకు మానవహారం కూడా నిర్వహించామని వివరించారు. పార్టీ శ్రేణులలో జాతీయవాదాన్ని పెంపొందించేలా పవన్ కల్యాణ్ పార్టీని నిర్మించారని పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా దీటైన, బలమైన సమాధానం ఇస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పెగాసస్ నివేదికపై సుప్రీం కీలక వ్యాఖ్య.. దేశ భద్రతే ముఖ్యమని వెల్లడి

- మొదటి పేజీ తరువాయి

అభిప్రాయపడింది. “దేశ భద్రత, సార్వభౌమాధికారానికి సంబంధించిన ఏ నివేదికనూ మేం బహిర్గతం చేయబోం. అటువంటి నివేదికలను వీధి చర్చల పత్రంగా మార్చకూడదు” అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పెగాసస్ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఇదే సమయంలో వ్యక్తిగత గోప్యతా ఉల్లంఘనకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించే విషయాన్ని పరిశీలించవచ్చని ధర్మాసనం సూచనప్రాయంగా తెలిపింది. గోప్యతా హక్కుకు భంగం వాటిల్లిందని భావించే వ్యక్తుల నిర్దిష్ట కేసులను పరిశీలించే అవకాశం ఉందని సంకేతాలిచ్చింది. దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూనే, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన ఫిర్యాదులను వినేందుకు సుప్రీంకోర్టు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. పెగాసస్ వ్యవహారంలో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సాంకేతిక నిపుణుల కమిటీని గతంలో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ నివేదికను సమర్పించినప్పటికీ, దానిలోని అంశాలను గోప్యంగా ఉంచాలని సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయించింది.

పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు

# ప్రజా ఉపయోగకరం అయిన పనులు చేసే పాత్రికేయులకి మాస్ వార్నింగ్

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 29:**

అన్యాయం జరుగుతున్న పరిస్థితి నీకు ఎందుకు అంటూ మాటలు దాటున్నపెద్దలు. పేదల సొమ్ము తీసుకోకండి అంటూ ప్రజల పక్షాన నిలబడితే ఇలాంటి అకృత్యాలు. పేదల డబ్బుల్లో భాగమే ఇప్పుడు ఫోన్ లో మాట్లాడిన వారికి ఉందా??అంటున్న పేదలు. ఖాజీపాలెం గ్రామము లో ఈ శ్రమ కార్డ్ ల మంజూరు లో మామూళ్ల మత్తులో అనేక మంది దిగారు అనటానికి నిదర్శనంగా మారింది ఈ ఫోన్ సంభాషణ లోని మాటలు. పేదలను పిండకండి అంటూ వార్తలు ప్రచురణ చేసిన వ్యక్తి పై ఉన్నత వర్గాల వారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం హాస్యపదంగా మారింది. పాత్రికేయుడు దళితుడు అనేచులకనతో ఇలా మాట్లాడటం ఏమిటి అని పలువురు ప్రశ్నల వర్షం కురుపిస్తున్నారు. అసలు పేదల వద్ద డబ్బులు ఎందుకు అని ప్రశ్నిస్తే కేస్ లు పెడతాం అని బెదిరింపులు పర్వం కొనసాగుతుంది. అసలు మాట్లాడటానికి వారికి ఏమి పని. కేస్ లు ఎవరి సొత్తు కాదు. కాబట్టి మా ఊరు అంటూ పాత్రికేయునికి భయం పెట్టటం ఎంతవరకు సమంజసం. చూడాలి ఏమి చేస్తారో అనేది.

## దామిశెట్టి శీనయ్యకు ఘనంగా నివాళులు అర్పించిన రెడ్ క్రాస్ సభ్యులు



**కావలి పెన్ పవర్- ఏప్రిల్29**

కావలి రెడ్ క్రాస్ జీవిత పోషక సభ్యులు, వాక్సిన్ సెంటర్ దాత దామిశెట్టి శ్రీనివాసులు నాయుడుకు రెడ్ క్రాస్ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం రెడ్ క్రాస్ భవనంలో దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ, దామిశెట్టి శీనయ్య కష్టపడి చిన్నస్థాయి నుండి పారిశ్రామికవేత్తగా ఎదిగారని, కావలిలో రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు ఏర్పాటుచేసి పలువురికి ఉపాధి కల్పించారని అన్నారు. అంతేకాక ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి పలువురు పేద విద్యార్థులకు విద్యాదానం చేసారని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ పోషక సభ్యత్వం స్వీకరించడంతో పాటు, వారి తల్లిదండ్రుల పేరుతో వాక్సిన్ సెంటర్ ఏర్పాటుకు సహకరించారని వివరించారు. రెడ్ క్రాస్ పోషక సభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బుర్ల రఘుకుమార్ రెడ్డి మాట్లాడుతూ, శీనయ్య చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరిని ఆప్యాయతతో పలుకరిస్తారని, వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సహకరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ పామూరు శ్రీధర్, కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, గాదిరెడ్డి మురళీకృష్ణ తదితరులు శీనయ్యతో తమ అనుబంధం గురించి, రెడ్ క్రాస్ కు వారు అందించిన సహకారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తేది క్రాస్ బాధ్యులు కలికి శ్రీహరి రెడ్డి, కె హరినారప రెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బియస్ ప్రసాద్, నల్లిపోగు ప్రణీత్, దామిశెట్టి సురేంద్ర, రెడ్ క్రాస్ సిబ్బంది దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు.

## శ్రీ ఆంజనేయ స్వామి కి అభిషేకం మరియు పూజ కార్యక్రమాలు





**కావలి పెన్ పవర్ - ఏప్రిల్ 29**

కావలి పట్టణంలోని వెంగల్ రావు నగర్, నవ వికాస్ సెంటర్, వాటర్ ట్యాంక్ ల వద్ద ఉన్న శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో వెలసియున్న శ్రీ ఆంజనేయస్వామి వారికి మంగళవారం దాత భోగి శెట్టి రమేష్ ధర్మపత్ని ఉషా దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం మరియు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి స్వామివారి ఆశీస్సులు స్వీకరించారు. అనంతరం దేవాలయానికి విచ్చేసిన భక్తులకి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవ వికాస్ సెంటర్ యువత పి నరసింహం, సంతోష్, వేణు, కోటేశ్వరరావు, నరేష్, వెంకీ, పవన్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ షెడ్యూల్ ఇదే

**- విక్రమ సింహపురి యూనివర్శిటీలో ఏప్రిల్ 30 నుండి మే 3 వరకు మహిళల టోర్నమెంట్.**

**-ముఖ్యఅతిథులుగా హాజరు కానున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**వెంకటాచలం, (పెన్ పవర్) ఏప్రిల్ 29**

విక్రమ సింహపురి యూనివర్శిటీలో వర్శిటీ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అధ్యక్షతన ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగనున్న అఖిల భారత అంతర యూనివర్శిటీల సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ షెడ్యూల్ ను అధికారులు విడుదల చేసారు. మొదటి రోజున ఉదయం 6.30 గంటల నుండే క్రీడా పోటీలు ప్రారంభం కానుండగా ప్రారంభ వేడుక సాయంత్రం 5 గంటలకు జరగనుంది. ప్రారంభ వేడుకలో ముఖ్యఅతిథిలుగా సర్వేపల్లి ఎమ్మెల్యే శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి , కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొననున్నారు. జిల్లా కలెక్టర్ శ్రీ ఓ.ఆనంద్ , జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. ఏప్రిల్ 30 నుండి మే 3వ తేది వరకు జరగనున్న మహిళల టోర్నమెంట్ కు సంబంధించి మొత్తం 95 జట్లు పోటీ పడనున్నారు. నాక్ అవుట్ దశలో పూల్ ఎ, బి, సి, డి ఇలా నాలుగు పూల్స్ లో మొత్తం 91 మ్యాచ్ లు జరగనున్నాయి. ఈ దశలో ఏదైనా టీమ్ ఒక్క మ్యాచ్ ఓడినా టోర్నీ నుండి నిష్క్రమించాల్సి ఉంటుంది. ఈ నాలుగు పూల్స్ లో నుండి చివరకి ఒక్కో టీమ్ లీగ్ దశకు చేరుకుంటాయి. లీగ్ దశలో మిగిలిన నాలుగు టీమ్ లు, ఒక్కో టీమ్ మిగిలిన మూడు టీమ్ లతో పోటీ పడాల్సి ఉంటుంది. ఈ దశలో ఎక్కువ మ్యాచ్ లు గెలిచి అధిక పాయింట్లు సాధించిన టీమ్ ను విజేతగా ప్రకటిస్తారు.మొదటి రోజున పూల్ ఎ లో మొదటి మ్యాచ్ లో తెలంగాణ యూనివర్శిటీ, స్వర్ణజిత్ గుజరాత్ స్పోర్ట్స్ యూనివర్శిటీ జట్లు తలపడనున్నారు. తదుపరి మ్యాచ్ లో ఒడిశా లోని శిక్షా ఓ అనుసంధాన్ యూనివర్శిటీ జట్టుతో భోపాల్ లోని బర్కతుల్లా యూనివర్శిటీ జట్టు తలపడనుంది. పూల్ బి లో మొదటి మ్యాచ్ లో హైదరాబాద్ జేఎన్టీయూ జట్టుతో ఆగ్రాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ జట్టు తలపడనుంది. తదుపరి మ్యాచ్ లో నల్గొండలోని మహాత్మా గాంధీ యూనివర్శిటీ జట్టుతో చెన్నైలోని అన్నా యూనివర్శిటీ జట్టు తలపడనుంది. పూల్ సి లో మొదటి మ్యాచ్ లో అనంతపురం శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్శిటీ జట్టుతో హైదరాబాద్ లోని వీసీఐ మహిళా యూనివర్శిటీ జట్టు తలపడనుంది. తదుపరి మ్యాచ్ లో కన్నూరు యూనివర్శిటీ జట్టుతో కేరళ యూనివర్శిటీ జట్టు తలపడనుంది. పూల్ డి లో మొదటి మ్యాచ్ లో ముంబై యూనివర్శిటీ జట్టుతో కరీంనగర్ లోని శాతవాహన యూనివర్శిటీ జట్టు తలపడనుంది. తదుపరి మ్యాచ్ లో నాందేడ్ లోని స్వామి రామానంద తీర్థ్ మరత్వాడ యూనివర్శిటీ జట్టుతో బికనీర్ లోని మహారాజ గంగాసింగ్ యూనివర్శిటీ జట్టు తలపడనుంది. ఈ క్రీడా పోటీల నిర్వహణ కోసం జాతీయ స్థాయిలో సాఫ్ట్ బాల్ లో పేరొందిన 40 మంది అంపైర్ లను, రెఫరీలను యూనివర్శిటీ వారు రప్పించారు. పోటీలు సజావుగా జరిగేందుకు అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నారు. యూనివర్శిటీ ఆధ్వర్యంలో మొత్తం టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో 15 కమిటీలను నియమించి క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వర్శిటీ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారులతో, పోలీసు అధికారులతో, విద్యుత్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ త్రాగు నీటికి, విద్యుత్తుకి, భద్రతకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసారు.

# ఎన్ సి సి మూడవ వార్షిక శిక్షణా శిభిరం




**వెంకటాచలం, (పెన్ పవర్) ఏప్రిల్ 29**

10 ఆంధ్ర నేవల్ యూనిట్ యన్ సి సి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ మరియు క్యాంపు కమాండెంట్ గణేష్ గొదంగవే ఆధ్వర్యంలో 10 ఆంధ్ర నేవల్ యూనిట్ యన్ సి సి యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్-3, 28 ఏప్రిల్ 2025 నుంచి 07 మే 2025 వరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం అక్షర విద్యాలయ నందునిర్వహింపబడుతున్నది.

ఈ క్యాంపును ఉద్దేశించి క్యాంపు కమాండెంట్ గణేష్ గొదం గవే మాట్లాడుతూ....... ఈ శిక్షణ శిబిరంలో 565 మంది ఎన్సిసి క్యాండిడేట్లు హాజరై శిక్షణ పొందుతున్నారు. కేడేట్లు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, సామాజిక సేవ, దేశ భక్తి, గన్ ఫైరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఈ శిక్షణను మంచిగా ఉపయోగించుకుని అత్యు త్తమ పౌరులుగా ఎదిగి దేశ సేవ చేయాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తగినంత మంచినీరు తాగాలని క్యాడేట్లకు ఉద్బోధించారు. ఈ క్యాంపులో ఈరోజు శారీరక వ్యాయామం, యోగ ఆసనాలు, నౌక నమూనా నిర్మాణం, వ్యక్తిత్వ వికాసం, సామాజిక అవగాహన, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలు, సమాచార వ్యవస్థ, ఆయుధ శిక్షణ, ఆరోగ్యము మరియు పరిశుభ్రత లెక్చరర్, ఎన్సిసి గురించి అవగాహన ఉపన్యాసం, ఆటలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎన్సిసి అధికారులు గుండాల నరేంద్ర బాబు, మల్లికార్జున రెడ్డి, మస్తానయ్య, కొండారెడ్డి, సాయి శంకరి, పి ఐ స్టాఫ్ వైకుంఠం చీఫ్ ఇన్స్ట్రక్టర్, పెట్టీ ఆఫీసర్లు రంజన్, లోకేష్, లక్ష్మణ్, దీపక్,వెంకటేష్, రమణారావు, నవీన్, ఆఫీస్ సిబ్బంది సూపరింటెండెంట్ ముకుంద సాగర్, షిప్ మోడలింగ్ ఇన్స్ట్రక్టర్ రామన్ సీనియర్ అసిస్టెంట్లు షెహనాజ్ బేగం, కల్పన,జూనియర్ అసిస్టెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.




## కేంద్రం చేసిన 1972 సవరణ పై లక్ష మందితో కార్డు ఉద్యమం

**విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీంద్ర నాథ్ రెడ్డ్**

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 29**

ఇటీవల కేంద్రము సెంట్రల్ సివిల్ సర్వీస్ 1972రూల్స్ సవరణ చేసినదని . దీని ప్రకారము పి ఆర్ సి కేవలం ఇప్పటినుండి రిటైర్డ్ అయిన వారికే వర్తిస్తుందని గతంలో రిటైర్డ్ అయిన వారికి ఎలాంటి పిఆర్సి అమలు కాదని పార్లమెంటులో చట్టం చేసినదని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి రవీంద్రానాథరెడ్డి పార్కున్నారు. మంగళవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దీనిని త్వరలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అమలు జరిపే ప్రమాదం ఉందని ,అందువలన పెన్షనర్స్ అందరు కూడా తమ నిరసనను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలని విశ్రాంత ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శిరవీంద్రనాధ రెడ్డి తెలియజేశారు. త్వరలో లక్ష మందితో కార్డు క్యాంపియన్ నిర్వహించబోతున్నామని తెలియజేశారు. పి ఆర్ సి బకాయిలు చెల్లించాలని, క్వాంటం గతంలో వలె 10 శాతం 15% ఇవ్వాలని, సభ ద్వారా డిమాండ్ చేశారు .ఈ సమావేశంలో ఎం. భాస్కర్ రెడ్డి, ఎం. రంగయ్య ,శివారెడ్డి,బి. పాండు, ఎం. వెంకటస్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## సిపిఐ మండల 6వ మహాసభలను జయప్రదం చేయండి

**సిపిఐ మండల కార్యదర్శి యస్.కె.వై పెద్ద మస్తాన్**

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 29**

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో నేడు చంద్రశేఖరపురం పట్టణంలో ఉదయము 10 గంటలకు జరగనున్న సీపీఐ మండల 6వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్.కె.వై పెద్ద మస్తాన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మినారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు వై రవీంద్రబాబు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఎస్ డి మౌలాలి, నియోజకవర్గ కార్యదర్శి ఎస్ డి యాసిన్, కనిగిరి మండల కార్యదర్శి జిపి రామారావు, పామూరు మండల కార్యదర్శి పి ప్రభాకర్ మరియు జిల్లా నియోజకవర్గ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి తొలినాళ్లలో జిల్లా పశ్చిమ ప్రాంతంలో అనేక ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు. సామాజిక ఉద్యమాలకు, రాజకీయ చర్చలకు నిలయమైన పశ్చిమ ప్రాంతంలోని చంద్రశేఖరపురం మండలంలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాయింట్ కార్యదర్శులు ఎస్ రమేష్, జీ నరసింహులు సిపిఐ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్తానీ పౌరుల వీసాలు రద్దు - జిల్లా కలెక్టర్



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 29**

పాకిస్తానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీచేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 2025 ఏప్రిల్ 27 నుంచి రద్దుకావడం జరిగిందని, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. పాకిస్తానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీచేసిన వీసాలపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ నేపద్యంలో మెడికల్ వీసాలు, లాంగ్ టర్మ్ వీసాలు, దౌత్య మరియు అధికారిక వీసాలు మినహా అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 27 ఏప్రిల్, 2025 నుంచి రద్దుకావడం జరిగిందని, ఈ సందర్బంగా భారత ప్రభుత్వం పాకిస్తానీ పౌరులకు వీసా సేవలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. పాకిస్తానీ పౌరులకు జారీ చేయబడిన మెడికల్ వీసా 29 ఏప్రిల్, 2025 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయన్నారు. పాకిస్తానీ పౌరులకు జారీ చేయబడిన దీర్ఘకాలిక వీసాలు, దౌత్య, అధికారిక వీసాలకు వర్తించదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు.

## అత్యుత్తమ ప్రదర్శన కనపరిచిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 29:**

కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన కందుకూరు శ్రీ చైతన్య హైస్కూలు రామాల వైష్ణవి (593), ద్వితీయ స్థానము సాధించిన గుర్రం ముఖేష్ (592) లను విద్యార్థులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో చదివే ఉన్నత చదువులలో కూడా అత్యుత్తమ ప్రదర్శన కనపరచాలని చదువుకున్న విద్యాసంస్థలకు తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమములో చైతన్య విద్యాసంస్థల ఆర్ ఐ అనిల్ కుమార్, కో ఆర్డినేటర్ శ్రీనివాస రావు , ప్రిన్సిపల్ బి.సురేష్ , డీన్ బ్రహ్మయ్య , బ్యాచ్ ఇంచార్జి శివయ్య, ఏవో సురేష్ నాయుడు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న ఆర్టీసీ సమస్యలను పరిష్కరించాలి

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 29**

నేషనల్ మజ్దూర్ యూనిటీ రాష్ట్ర కమిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్నటువంటి ఆర్టీసీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని నెల్లూరు జిల్లా కమిటీ చైర్మన్ రామారావు అన్నారు.గత అనేక దఫాలుగా ఎర్ర బ్యాడ్జీలు నిరసన ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది అని అన్నారు. ఇప్పటికీ సమస్యల పరిష్కారం కాకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షల కార్యక్రమం చేపట్టడం జరిగింది అని అన్నారు. అందులో రెండవ రోజు కందుకూరు డిపో నందు నెల్లూరు జిల్లా కమిటీ చైర్మన్ యం.రామారావు,జిల్లా గ్రీవెన్స్ కార్యదర్శి యస్.కే బాబు పాల్గొన్నారు. కార్యక్రమానికి గ్యారేజ్ అధ్యక్షులు కె.యస్ గంగాధర్ అధ్యక్షత వహించారు. జిల్లా చైర్మన్ రామారావు మాట్లాడుతూ మేనేజ్మెంట్ వెంటనే 1/2019 సర్క్యులర్ ను అమలుచేయాలని ,గత 4 సంవత్సరాలు గా నిలుపుదల చేసిన ప్రమోషన్లలను వెంటనే ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల మాదిరిగా సంస్థ లోని మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు వారు కోరుకొన్న మాదిరిగా ఇవ్వాలని కోరారు. ఈ హెచ్ ఎస్ స్థానంలో పాత మెడికల్ విధానాన్ని అమలు చేయాలని, అన్నీరకాల సిక్ లకు కమిటేషన్ లీవులు మంజూరు చేయాలని,ఆన్ కాల్ డ్రైవర్లకు జీతం పెంచాలని, డబుల్ డ్యూటీ కి డబుల్ వేతనం పెంచాలని, గ్యారేజ్ లో ఏళ్ళ తరబడి ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ రిలే నిరాహారదీక్షల శిభిరం లో కె.వి.ఆర్ రెడ్డి,ఆర్.ప్రబాకర్ రావు,సి.హెచ్ . వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

## మహిళలు కుట్టు శిక్షణలో నైపుణ్యం పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలి





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 29:**

పట్టణంలోని టిఆర్ఆర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈ డబ్ల్యు ఎస్ కార్పొరేషన్ వారి సహకారంతో కందుకూరు పట్టణ మండల మహిళల కొరకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఉదయం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు కేవలం భర్త సంపాదన పైనే ఆధారపడకుండా టైలరింగ్ నేర్చుకుని తద్వారా వచ్చే సంపాదనతో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల పేరుతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మహిళలందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కందుకూరు పట్టణ మరియు మండల మహిళలకు ఉచిత టైలరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో శుభపరిణామమని ప్రతి మహిళ టైలరింగ్ లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన టైలరింగ్ నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పించి 90 రోజుల తర్వాత ఉచితంగా కుట్టు మిషన్ పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని టైలరింగ్ శిక్షణకు విచ్చేసిన మహిళలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, బిజెపి పార్టీ నాయకులు ఘట్టమనేని హరిబాబు పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర, ముచ్చు శ్రీను, మహర్షి శ్రీను, అత్తంటి శ్రీహరి నాయుడు, గడ్డం మాలకొండయ్య, పొడపాటి మహేష్, చుండూరి శ్రీను, పువ్వాడి కోటయ్య, భవనాసి వెంకటేశ్వర్లు, షేక్ నాగూర్, గుర్రం మధు, కళ్యాణ్, మహిళా నాయకులు కల్లూరి శైలజ బత్తిన ఆదెమ్మ, కంసాని మయూరి, ఎస్తేరమ్మ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా కంచర్ల శ్రీకాంత్ జన్మదిన వేడుకలు






**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 29**

కుప్పంనియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ జన్మదిన వేడుకలు స్థానిక అన్న క్యాంటీన్ నందు తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. కందుకూరు టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షుడు నార్నే రోశయ్య ఆధ్వర్యంలో అన్నక్యాంటీన్ నందు కేక్ కటింగ్ చేసి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలుగుదేశం పార్టీ అధికారంలో లేనప్పుడు ఎమ్మెల్సీగా గెలిచి చరిత్ర సృష్టించాడని అన్నారు. అలాంటి శ్రీకాంత్ ఆయురారోగ్యాలతో తెలుగుదేశం పార్టీకి ప్రజలకు మరిన్ని సేవలందించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చిలకపాటి మధు, గడ్డం మాలకొండయ్య,వడ్డెల్ల రవిచంద్ర, పువ్వాడి కోటయ్య, రావూరి రామకోటయ్య,కొత్తూరి సుధాకర్, ముప్పవరపు వేణు, తెలుగు యువత నాయకులు పొడపాటి మహేష్, పోకూరి రాంబాబు,గుర్రం మధు, చవిడిబోయిన కృష్ణ, చుండూరి శ్రీకాంత్ మురారిశెట్టి సుధీర్, కోటా కిషోర్, చక్కా కేశవరావు,ఇస్కాల మధు,శివ,మనోహర్, పార్టీ నాయకులు ,కార్యకర్తలు, శ్రీకాంత్ స్నేహితులు, అభిమానులు పాల్గొన్నారు.

# జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో స్పెషల్ డ్రైవ్



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 29**

ప్రకాశం జిల్లా సంయుక్త కలెక్టరు, గోపాలకృష్ణ కోణంకి, ప్రకాశం జిల్లాలో ఎన్ ఫోర్స్ మెంట్ డే గా నిర్ణయించినందున మంగళవారం జిల్లాలోని రెవెన్యూ అధికారులు, పౌరసరఫరాల అధికారులు, ఎన్ ఫోర్స్ మెంట్ సిబ్బంది, పుడ్, సిఫ్ట్ అధికారులు, లీగల్ మెట్రోలజీ అధికారులు, ఫైర్ డిపార్ట్మెంట్ వారు ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఉదయం 6.00 గంటల నుండి అధికారులందరూ జిల్లాలో స్పెషల్ డ్రైవ్ లో తనిఖీలు నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీలు, రేషన్ షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్స్ రైస్ మిల్లులు, బాణాసంచా గోడౌన్లు, వాటర్ ఆర్ఓ ప్లాంట్లు, ఐస్ క్రీమ్ ఇండ్రస్టీస్, సినిమా హాళ్ళు కూడా తనిఖీలు చేశారు. పెట్రోలు బంకులు 30, గ్యాస్ ఏజెన్సీలు-23, రేషన్ షాపులు-23, ఎంఎల్ఎస్ పాయింట్స్-11, రైస్ మిల్లులు-13, బాణసంచా గోడా వాటర్ ఆర్ఓ ప్లాంట్లు-15, ఐస్ క్రీమ్ ఇండ్రస్టీస్-1 సినిమా హాళ్ళు-9 తనిఖీలు చేశారు. ఈ రోజు స్పెషల్ డ్రైవ్ లో తనిఖీలు నిర్వహించిన వారిలో సంయుక్త కలెక్టరు, ప్రకాశం జిల్లా గోపాలకృష్ణ రోణంకి, జిల్లా పౌరసరఫరాల అధికారి యస్ పద్మశ్రీ, జిల్లాలోని అందరూ తహశీల్దార్లు, సివిల్ సప్లయ్ ఎన్ పోర్స్ మెంట్ సిబ్బంది, ఫుడ్%ఇ% సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రోలజీ అధికారులు, ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు పాల్గొన్నారు.



## దొనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తుల పోస్ట్ ఎక్స్పోజర్ ప్రో ఫైలాక్సిస్ పి ఈ పి చికిత్స





**దొనకొండ ఏప్రిల్ 29 పెన్ పవర్**

మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కట్టకిందపల్లి, నారారెడ్డిపల్లి,రుద్ర సముద్రం గ్రామాలకు చెందిన కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు పోస్ట్ ఎక్స్పోజర్ ప్రొఫైలాక్సిస్ పి ఈ పి చికిత్సలో భాగంగా వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు చికిత్స అందించినట్లు జిల్లా కుష్టు ఎయిడ్స్ క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు గ్రామాలలో పర్యటించి వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవలను సమీక్షించి, పర్యవేక్షించారు. ఈ గ్రామాలలోని క్షయ వ్యాధిగ్రస్తుల గృహాలను కూడా సందర్శించి వారు తప్పకుండా ఆరు నెలలపాటు చికిత్స తీసుకోవాలని, బలమైన ఆహారం భుజించాలని సూచించారు. అనంతరం దొనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి దొనకొండ, ఆరవెళ్లపాడు, గంగదేవిపల్లి, కొచ్చర్లకోట గ్రామాలకు చెందిన ఆషా కార్యకర్తలకు, మహిళా ఆరోగ్య కార్యకర్తలకు, మరియు ఇతర వైద్య సిబ్బందికి "సై టీబీ" పరీక్షలు నిర్వహించారు. 2030 సంవత్సరం నాటికి ఇండియాను క్షయ వ్యాధి రహిత దేశంగా చేయాలన్న లక్ష్యంతో పని చేయాలని సిబ్బందికి సూచించారు. 01-11-2024 తర్వాత నిర్ధారణ అయిన క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులందరికీ సై టీబీ పరీక్షలు నిర్వహించి తద్వారా కుటుంబ సభ్యులకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాల్సిందిగా దొనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. అన్వేష్ కుమార్ ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, మల్టీ పర్పస్ హెల్త్ సూపర్వైజర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్, సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్వైజర్ సాయి, సీనియర్ టిబి సూపర్వైజర్ సురేష్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, మరియు ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కిషోర వికాసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**11 -18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికల వివరాలు వారి ఫోన్ నెంబర్లు సేకరించాలి.**

**విద్య ,ఆరోగ్యం ,బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, పౌష్టికాహారం, శక్తి యాప్, మనమిత్ర తదితర వాటిపై వారికి అవగాహన కల్పించాలి.**

**మే నెల రెండవ తేదీ నుంచి జూన్ నెల 10వ తేదీ వరకు కార్యక్రమం గ్రామ గ్రామాన నిర్వహించాలి.**

**అంగన్వాడి సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు, మహిళా పోలీసులు, తదితర శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంగా కృషి చేయాలి.**

**కొమరోలు ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి.**





**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 29**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కిషోర్ వికాసం కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు ,సిబ్బంది సమన్వయంగా పనిచేసి విజయవంతం చేయాలని కొమరోలు ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి తెలిపారు. కొమరోలు లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి అధ్యక్షత వహించగా ,కొమరోలు మండల పరిషత్ అధ్యక్షురాలు కామూరి అమూల్య ,ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి, ఏపిఎం రఘునాధ బాబు, ఎంఈఓ కే వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ 11- 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలను కిశోర బాలికలుగా గుర్తించాలని, వారి పూర్తి వివరాలను, ఫోన్ నెంబర్లను సేకరించాలని ఆమె కోరారు. అంగన్వాడి కార్యకర్తలు ,పొదుపు సంఘాల మహిళలు, మహిళా పోలీసులు సమన్వయంగా పనిచేసి గ్రామాల వారీగా కిశోర బాలికల వివరాలు సేకరించాలన్నారు. అంతేకాక వారిలో అర్ధాంతరంగా చదువులు మానివేసిన వారి వివరాలను సేకరించి, తిరిగి వారు పాఠశాలలు కళాశాలలో చేరి చదువులను కొనసాగించేందుకు వారిని ప్రోత్సహించాలని ఆమె చెప్పారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను, కష్టనష్టాలను కిశోర బాలికలకు వివరించడంతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా పూర్తి అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల సమాచారాన్ని ముందుగానే సేకరించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ఎట్టి పరిస్థితులలో కూడా బాల్యవివాహాలు జరగకుండా అడ్డుకోవలసిన బాధ్యత అందరిపై ఉన్నదని ఆమె తెలిపారు. కిషోర్ బాలికలు తీసుకుంటున్న పౌష్టికాహారం తో పాటు వారి వ్యక్తిగత పరిశుభ్రతపై కూడా వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాలు మే నెల రెండవ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించి కిశోర బాలికల పూర్తి వివరాలను



సేకరించాలని తద్వారా వారికి ఆఫ్లైన్ ద్వారా శిక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని ఆమె పేర్కొన్నారు. నేటి కిషోర్ బాలికలే రేపటి గర్భవతులు, తల్లులు అనే వాస్తవాలను కిశోర బాలికలకు తెలియజేసి ఇప్పటినుంచేవారు శారీరకంగా, మానసికంగా పరిపుష్టి సాధించేందుకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల పరిషత్ అధ్యక్షురాలు కామూరి అమూల్య మాట్లాడుతూ, కిశోర బాలికలలో రక్తహీనత నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. సృష్టికి మూలం మహిళ అని అందరికీ తెలిసినప్పటికీ ఇంకా మహిళలపై వివక్షత కొనసాగుతున్నదని ఆమె విచారం వ్యక్తం చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రాన్ని కిశోర బాలికలు, మహిళలు తోపాటు అందరూ పాటించే విధంగా కృషి చేయాలన్నారు .మగ పిల్లలతో పాటు ఆడపిల్లలకు కూడా సమాన చదువులు, ఆరోగ్యం, ఆహారం అభివృద్ధి కల్పించవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నదని ,ఇప్పటికీ అనేక కుటుంబాలలో ఆడపిల్లలపై వివక్షత కొనసాగుతున్నదని ఆమె పేర్కొన్నారు. వివక్షత అనేది మొదట ఇంటి నుంచి దూరం కావాలని ,అది అలాగే పెరిగితే సమాజంలో కూడా వివక్షత పెరిగి బాలికల అభివృద్ధికి అవరోధంగా మారుతుందని తెలిపారు.

ఎంపీడీవో మస్తాన్వలి మాట్లాడుతూ నేటి సమాజంలో కిశోర బాలికలు అనేక సమస్యలు ఎదుర్కొంటూ, ఇబ్బందులు పడుతున్నారని ,వారి జీవనశైలిలో వస్తున్న మార్పుల ఆధారంగా వారికి సౌకర్యాలు, ఆరోగ్యపరమైన జాగ్రత్తలు కల్పించాలని, మానవ అక్రమ రవాణా తదితర వాటిపై సంపూర్ణ అవగాహన కల్పించాలని కోరారు, శక్తి యాప్ పై అవగాహన కల్పించి ప్రతి కిషోర్ బాలిక సెల్ఫోన్లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసి ఇవ్వాలన్నారు. అర్ధాంతరంగా చదువులు మానివేసిన బాలికలను తిరిగి విద్యాసంస్థలలో చేర్పించేందుకు పాటుపడాలని ఆయన కోరారు. సైబర్ నేరాల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించాలని, సమాజంలో జరుగుతున్న మోసాలను ఆయన వివరిస్తూ ఎంపీడీవో స్థాయిలో ఉన్న తననే సైబర్ నేరగాళ్లు పంచాయతీరాజ్ కమిషనర్ పేరుతో మాయమాటలు చెప్పి మోసం చేశారని, తద్వారా తాను తొందరపాటులో వారి మోసాలను గ్రహించలేక 40 వేల రూపాయలను పోగొట్టుకోవాల్సి వచ్చిందని ఆయన ఉదాహరించారు. అందువల్ల నిరక్షరాశులు, విద్యావంతులు, ఉద్యోగస్తులు అనే తేడా లేకుండా సైబర్ నేరగాళ్లు అందర్నీ మోసం చేసేందుకు పన్నాగాలు చేస్తున్నారని ,అందువల్ల ఎట్టి పరిస్థితుల్లో కూడా వారి మోసాలకు గురి అయ్యి నష్టపోవద్దని ఆయన వివరించారు. కిశోర బాలికల కు ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల పరిశుభ్రత, దుస్తుల పరిశుభ్రత, పౌష్టికాహారం ,ఆరోగ్యం తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని ఆయన కోరారు. అంతేకాక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న భీమా పథకాలపై కూడా ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. ఆ కార్యక్రమంలో ఏపీయం రఘునాధ బాబు, ఎంఈఓ వెంకటేశ్వర్లు కిశోర వికాసం పై మాట్లాడుతూ పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు , కొమరోలు కమ్యూనిటీ కోఆర్డినేటర్ జక్కుల స్వప్న ,పొదుపు సంఘాల మహిళలు, గ్రామక్య సంఘం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్య వర్గం

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 29**

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం మంగళవారం నాడు గిద్దలూరు మండల కార్యాలయము సమావేశమై గిద్దలూరు సమితి కు సంబంధించిన నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ను ఎన్నుకున్నారు నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం సమితి ప్రెసిడెంట్ గా షేక్.నాయబ్ రసూల్ ను ఏకగ్రీవముగా ఎన్నుకోన్నారు , వైస్ ప్రెసిడెంట్ గా డి శరత్ కుమార్. సెక్రటరీగా కెవి రమణ రెడ్డి . జాయింట్ సెక్రటరీగా ఎం రాజు. ట్రెజరర్ గా బి నిర్మలమ్మ. కో ఆప్షన్ నెంబర్ షేక్ .రసూల్ లు ఏకగ్రీవముగాఎన్నికయ్యారు ఎన్నికల అధికారిగా మాజీ జిల్లా అధ్యక్షులు వై పోలయ్య మరియు ఎన్నికల పరిశీలకులుగా కె.వి.రమణారెడ్డి లు వ్యవహరించారు.

# ఆక్రమణల చెర నుండి వక్ఫ్ భూములకు విముక్తి కల్పించాలి

## – డిఆర్ఓ బి.చిన ఓబులేసు

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 29**

ఆక్రమణలకు గురైన వక్ఫ్ భూములను విడిపించి తిరిగి ఆయా సంస్థలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు చెప్పారు. సోమవారం జిల్లా వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశం ప్రకాశం భవనం లో ఆయన అధ్యక్షతన జరిగింది. జిల్లాలో 1542 ఎకరాల వక్ఫ్ భూమి ఆక్రమణకు గురైనట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి చెప్పినట్లు ఆయన తెలిపారు. ఈ ఆక్రమణల నుంచి వాటిని విడిపించడంతోపాటు వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే సమావేశం నాటికి ఈ దిశగా చేపట్టిన చర్యల నివేదికలను సిద్ధం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్స్పెక్టర్ ఆడిటర్ షేక్ అహమద్ బాష, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, డిపిఓ జి. వెంకటనాయుడు, జిల్లా రిజిస్ట్రారర్ బాలంజనేయులు,ఆర్ అండ్ బి ఈఈ గోపీ నాయక్, సర్వే, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

# వికసిత భారత్ లక్ష్యంగా పధకాల అమలు

## – అధికారుల సమీక్ష లో

**20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్**



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 29**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పించిన వికసిత భారత్-2047, స్వర్ణాంధ్ర- 2047 లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రాయోజిత పథకాల లబ్ధిని అర్హులైన లబ్దిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్ కోరారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్, అధికారులతో సమావేశమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల అమలు తీరు, మౌలిక సదుపాయాలు కల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో త్రాగు, సాగు నీటి సమస్యతో పాటు ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉందని, ఫ్లోరైడ్ పీడిత జిల్లాల్లో ప్రకాశం జిల్లా ఒకటని అన్నారు. నేడు మన జిల్లాకు త్రాగు నీరు, ఫ్లోరిడ్ ప్రభావిత ప్రాంతాలలో సహాయం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానసిక పుత్రిక పి4 స్ఫూర్తితో కొన్ని కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపార, సేవా సంస్థలను తీసుకురావడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఫ్లోరిడ్ సమస్యకు చరమగీతం పాడితేనే వికసిత భారత్, స్వర్ణఆంధ్ర లో ప్రకాశం జిల్లా భాగస్వామ్యం కాగలదని ఆయన తెలిపారు. జిల్లాలో ఉన్నటువంటి త్రాగు, సాగు నీటి సమస్యతో పాటు ఫ్లోరైడ్ సమస్య పరిస్థితులు, తీవ్రత ఏ విధంగా ఉంది, వాటి ప్రభావం ప్రజలపై ఏ విధంగా ఉంది, సహేతికంగా వివరిస్తూ, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పూర్తీ స్థాయిలో నివేదిక, ప్రతిపాదనలు పంపాలని దినకర్, అధికారులను కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో వున్నటువంటి త్రాగు నీటి సమస్య పై క్షుణ్ణంగా సమీక్షించి తగు సూచనలు చేశారు. అలాగే ఫ్లోరైడ్ సమస్య ప్రభావం జిల్లా లో ఎలా వుంది, ఫ్లోరైడ్ నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య నివారణకు రక్షిత మంచి నీటి ప్లాంట్స్ ఏర్పాటుకు, డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు సామాజిక బాధ్యతతో కేంద్ర, ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపార మరియు సేవా సంస్థలు ముందుకు వస్తున్నారని, కావున అధికారులు 2047 విజన్ ప్లాన్ ను దృష్టిలో ఉంచుకుని సంబంధిత సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి స్థాయిలో నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్ డబ్ల్యూఎస్. ఎస్ఈ బాల శంకర రావు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ వర లక్ష్మి, పశు సంవర్ధక శాఖ జెడి డా. బేబి రాణి, డిసిహెచ్ఎస్ డా. శ్రీనివాస నాయక్, డిఎస్ఓ పద్మావతి, గ్రౌండ్ వాటర్ డిడి విద్యాసాగర్, పవర్ గ్రిడ్ ప్రతినిధి ఎం.ఎన్ రావు, జయప్రద ఫౌండేషన్, వీనస్ ఫౌండేషన్ ప్రతినిధులు రఘురామ్, ఇండో సెల్, లారస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలనాథ స్వామి దేవస్థానమునకు పట్టు వస్త్రములు, బంగారు ఆభరణాలు

**బహుకరించిన మున్నయ్య కుటుంబ సభ్యులు**




**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 29**

చంద్రశేఖరపురం మండలంలోని అయ్యలూరివారిపల్లి పంచాయతీ పరిధిలో గల శ్రీ శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథ స్వామి దేవస్థానమునకు అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని జినుగువారిపల్లి గ్రామమునకు చెందిన వ్యాపార రీత్యా హైదరాబాద్ లో స్థిరపడిన మున్నయ్య ధర్మపత్ని సునీత అల్లుడు నారాయణ ధర్మపత్ని హైమావతి కుమారులు హరి నారాయణ, హరిచరణ్, పద్మావతి మరియు కుటుంబ సభ్యులు కలిసి శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తిరుమలనాథ స్వామి వారికి పట్టు వస్త్రాలు మరియు అమ్మ వార్లకు ముక్కుపుడకలను స్వామివారి సేవకుడు రామమూర్తి స్వామివారికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ శ్రీ శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథ స్వామి దేవాలయం నందు (తిరుమల కొండ) అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి పట్టు వస్త్రాలు మరియు అమ్మవార్లకు బంగారు ముక్కుపుడకలు బహుకరించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా స్వామివారి సేవకుడు రామమూర్తి స్వామి మాట్లాడుతూ అక్షయ తృతీయ పర్వదినానికి ప్రత్యేక స్థానం ఉందని వైశాఖ శుద్ధ తదియ రోజు పరమశివుని అనుగ్రహంతో కుబేరుడు సంపదలకు రక్షకుడిగా నియమించిన రోజు కావడం అలాగే మహాలక్ష్మి శ్రీ విష్ణు వివాహం చేసుకున్న శుభదినముగా మన పురాణాల్లో పేర్కొనడం జరిగిందని అన్నారు. పరశురాముని పుట్టినరోజు పవిత్ర గంగానది భూమిని తాకిన రోజు, కృత యుగం మొదలైన రోజు అన్నపూర్ణాదేవి తన అవతారాన్ని స్వీకరించిన రోజు, శివుని ప్రార్థించి కుబేరుడు శ్రీ మహాలక్ష్మితో సమస్త సంపదలకు సంరక్షకునిగా నియమించిన రోజు, వ్యాస మహర్షి మహాభారతమును వినాయకుని సహాయముతో రాయడం మొదలుపెట్టిన రోజు అనేక రకాలుగా ఈరోజు అక్షయ తృతీయ ప్రాముఖ్యత కలిగిన రోజున స్వామివారికి బహుకరించిన దాతలను అభినందించారు అనంతరం దాతలు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆ మహాలక్ష్మి కృపాకటాక్షం అందరికీ లభించాలని కోరుకున్నారు.


# ఐ.టి.ఐ. ప్రవేశాల దరఖాస్తుకు ఆహ్వానం

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 29**

2025-26 వ సంవత్సరానికి ప్రకాశంజిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఐ.టి.ఐ. లలో మొదటి విడత ప్రవేశాల కొరకు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకోవాలని ప్రకాశంజిల్లా కన్వీనర్, ప్రభుత్వ బాలురు ఐ.టి.ఐ. ప్రధానాచార్యులు యం.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్హులైన అభ్యర్థులు అను వెబ్సైట్ ద్వారా తమ దరఖాస్తులను మే 24వ తేదీ సాయంత్రం గం. 5 ల లోగా నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే నమోదుకు సంబంధించిన పత్రాలను ప్రింట్ తీసుకోవాలని , జిల్లాలోని ఒకటి కంటే ఎక్కువ ఐ.టి.ఐ.లను కూడా ఎంపిక చేసుకోవచ్చునని తెలియజేశారు. ముఖ్యంగా దరఖాస్తు చేసిన వారు దరఖాస్తు ప్రింటు కాపీని, ఒరిజినల్ సర్టిఫికేట్లను తీసుకొని ప్రభుత్వ ఐ.టి.ఐ.లలో ఖచ్చితంగా తేది. 24-05-2025 లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. పూర్తి వివరములకు చరవాణి నంబరు 9492277552 ను కార్యాలయ పని వేళలలో సంప్రదించాలని తెలిపారు.

# మత్స్యకారుల సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం

## – ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 29**

మత్స్యకారుల సంక్షేమం, వారి అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు పేర్కొన్నారు. మత్స్యకారుల సేవలో... కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంగళవారం కొత్తపట్నం మండలం కే.పల్లెపాలెంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనార్ధన్ మత్స్యకారుల వేట నిషేధ కాలభృతి బ్యాంకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో 20వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు నియోజకవర్గంలో మొత్తం 3,596 మంది మత్స్యకారులకు రూ.7.19 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలుగుతున్నట్లు జనార్ధన్ చెప్పారు. ఒంగోలు మండలంలో 520 మంది, కొత్తపట్నం మండలంలో 3076 మంది మత్స్యకారులకు 20వేల రూపాయలు చొప్పున లబ్ధి కలుగుతున్నట్లు తెలిపారు. గతంలోనూ మత్స్యకారుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. వేట సమయంలో చనిపోతే ఐదు లక్షల రూపాయల చంద్రన్న బీమా అందించామని , సబ్సిడీపై మోపెడ్లు, ఆటోలను ఇచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల మత్స్యకార కాపులు, స్థానిక ప్రజాప్రతినిధులు,తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు సి.ఈ.ఓ.



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 29**

రాష్ట్ర వక్ఫ్ బోర్డు సి.ఈ.ఓ. షేక్ మహమ్మద్ అలీ మంగళవారం ప్రకాశం భవనంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను కలిశారు. జిల్లాలోని వక్ఫ్ భూముల స్థితిగతులపై వీరు చర్చించారు.

## ప్రధాని మోదీ పర్యటన విజయవంతం చేద్దాం

– వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ రాజన్




**రిపోర్టర్ ఇంకొల్లు, పెన్ పవర్ ఏప్రిల్ 29**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మనందరిదని, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక ఆంధ్రుల కలల రాజధాని అమరావతి పునర్నిర్మానంతో అభివృద్ధికి పునాదులు పడనున్నాయని ఆంధ్రప్రదేశ్ వన్యకుల క్షత్రియ చైర్మన్, పర్చూరు నియోజకవర్గ పరిశీలకులు రాజన్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాజధాని అభివృద్ధి పునర్నిర్మాణ శంకుస్థాపన నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటన విజయవంతం కోసం పర్చూరు నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పరిశీలకులు రాజన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్ ప్రజల గర్వకారణం అమరావతి అన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ప్రణాళికలు రచించారని గుర్తు చేశారు. ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో తెలుగు వారంతా కదిలి రావాలని పిలుపునిచ్చారు. కని విని ఎరుగని రీతిలో రాజధాని నిర్మాణం జరుగుతుందని, పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాలు ప్రజలంతా ప్రజాప్రతిన స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సభకు తరలివచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల కల అమరావతి రాజధాని అన్నారు. అమరావతి రైతుల త్యాగ ఫలం ప్రజల పోరాట ఫలం అమరావతి రాజధాని మనకు దక్కిందన్నారు. డబల్ ఇంజిన్ సర్కార్ లో ప్రధానమంత్రి మోడీ అమరావతి రాజధాని నిర్మాణం కోసం సహకారమందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి రావడం అంటే రాష్ట్ర ప్రజలకు ఒక పండగ లాంటిదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న నరేంద్ర మోడీకి స్వాగతం పలకడం ప్రజల కర్తవ్యం గా భావించి స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, తిరుమల శెట్టి శ్రీహరి,పొద వీరయ్య చౌదరి, నల్లపునేని రంగయ్య, తాటి నాగేశ్వరరావు, నాయకులు కామేపల్లి హరిబాబు, సుందర్ రావు, అబ్దుల్ రజాక్, జనార్ధన్, సురేష్, సురేంద్రబాబు, సీతయ్య, తారక రామారావు, నాగేశ్వరరావు, బంగారు బాబు, తదితరులు పాల్గొన్నారు.

## పొదిలి మునిసిపల్ కమిషనర్ ను కలసిన నారాయణ బాబు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 29**

పొదిలి నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి ని మంగళవారం నాడు తెలుగుదేశం నాయకులు, మాజీ మండల జడ్పిటిసి కాటూరి వెంకటనారాయణ బాబు కలిశారు నారాయణరెడ్డి ఇటీవలే కమిషనర్ గా బదిలీపై పొదిలికి వచ్చారు ఈ సందర్భాన్ని పునస్కరించుకొని వెంకటనారాయణ బాబు మునిసిపల్ కమిషనర్ నారాయణరెడ్డిని ఆయన కార్యాలయంలో కలుసుకొని, స్వీట్స్ బాక్స్ అందజేసి, తన శుభాకాంక్షలు తెలియజేశారు.

# టిడిపి గ్రామ కమిటీల ఎన్నికలు







**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 29**

కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు చంద్రశేఖరపురం మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు మరియు మండల టిడిపి నాయకులు ఆధ్వర్యంలో చంద్రశేఖరపురం మండలంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీలు ఎన్నికలు నిర్వహించుచున్నారు. ఈ సందర్భంగా మండలంలోని వి బైలు, కంభంపాడు, చెన్నపునాయునిపల్లి గ్రామాలలో ఎన్నికలను గ్రామాలలోని టిడిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు సమావేశం లో నూతన కమిటీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వి బైలు గ్రామ కమిటీ అధ్యక్షునిగా జమకాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా జమకాల భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా దొర తిరుపతయ్య, బూత్ కమిటీ కన్వీనర్లు గా జమకాల ఓబుల్ కృష్ణ, రంగస్వామి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కంభంపాడు గ్రామ కమిటీ అధ్యక్షునిగా నక్కల ఎరుకులయ్య, ప్రధాన కార్యదర్శిగా శానం బాజీని కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.చెన్నపునాయునిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షునిగా దేశణముక్కల వెంకటనారాయణ, ఉపాధ్యక్షులుగా చిట్టి బోయిన వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా తోడేటి రఘురాములు ను ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతనముగా ఎన్నికైన గ్రామ కమిటీలోని సభ్యులు పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా షీప్ సొసైటీ అధ్యక్షులు తోడేటి గోపి, మాజీ ఎంపీపీ తోడేటి అల్లూరయ్య, మండల క్లస్టర్ ఇంచార్జి యన్.సి. మాలకొండయ్య, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు బొబ్బూరి రమేష్, అట్లూరి రామకృష్ణంరాజు, బత్తుల వెంకటాద్రి, మితికాల సత్యం, కోనంగి వెంకట కొండయ్య, నన్నసాని వరలక్ష్మయ్య, మాజీ సర్పంచ్ సారే వెంకటసుబ్బయ్య, చింతం నాగభూషణం, కోటగిరి ప్రసాదు, చింతం భూషయ్య, రాయిని వెంకటేశ్వర్లు, మేకల చిన మాలకొండయ్య, మేకల ఆంజనేయులు, నూనె తిరుపతయ్య, తోడేటి రాజశేఖర్, షేక్ మౌలాలి ఆయా గ్రామాల టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల సమాచారాన్ని ముందస్తుగా సేకరించాలి

**సమాచార సేకరణలో జాప్యం జరుగుతున్నందువల్ల వివాహాలను అడ్డుకోవడంలో కలుగుతున్న ఇబ్బందులు.**

**ముహూర్త సమయానికి సమాచారం తెలుసుకుని అడ్డుకుంటున్నప్పటికీ దూర ప్రాంతాలకు తరలించి వివాహాలు జరిపిస్తున్నారు.**

**బాల్య వివాహాల నిరోధానికి అందరి సహకారం అవసరం –చింతలపల్లి మహిళా పోలీస్ విద్యా భవాని.**





**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 29**

బాల్య వివాహాల సమాచారాన్ని ముందస్తుగా సేకరించగలిగితే బాల్యవివాహాలను అడ్డుకోవచ్చని, కొమరోలు మండలం చింతల పల్లె గ్రామ సచివాలయ మహిళా పోలీస్ విద్యా భవాని పేర్కొన్నారు. కొమరోలు లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో మంగళవారం కిషోర్ వికాస్ కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి అధ్యక్షత వహించగా, కొమరోలు మండల పరిషత్ అధ్యక్షురాలు కామూరి అమూల్య ,ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి ,ఏపిఎం రఘునాధ బాబు ,ఎంఈఓ వెంకటేశ్వర్లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఆ కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్లు ,పొదుపు సంఘాల మహిళలు, గ్రామ ఐక్య సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. బాల్య వివాహాల వల్ల కలుగుతున్న అనర్ధాలు కష్టనష్టాల గురించి ముఖ్య అతిధులు వివరించారు. అనంతరం చింతల పల్లె గ్రామ సచివాలయ మహిళా పోలీస్ విద్యా భవాని మాట్లాడుతూ బాల్య వివాహాల వివరాలను ముందస్తుగా సేకరించాలని కోరారు. అలా కాకుండా వివాహానికి ఒకటి రెండు రోజులు ముందు సేకరించడం వలన బాల్య వివాహాలను అడ్డుకోవడం ఇబ్బందిగా మారుతున్నదని ఆమె అభిప్రాయపడ్డారు. ముహూర్త సమయానికి సమాచారం అందుకొని బాల్య వివాహాలను అడ్డుకునేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావడం లేదని, అప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకున్న ఇరు కుటుంబాల వారు తమ ముందు బాల్య వివాహాలను నిలిపివేస్తున్నట్లుగా ప్రకటించి, వధూవరులను రహస్యంగా దూరప్రాంతాలకు తరలించి వివాహాలు జరిపిస్తున్నారని అన్నారు. దీనితో అడ్డుకునేందుకు తాము చేసిన ప్రయత్నాలు ఫలించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల వలన బాలికల చదువులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతోపాటు వారి ఉజ్వల భవిష్యత్తు కుకూడా అవరోధాలు ఏర్పడగలవని అన్నారు. ఇప్పటికే కిషోర బాలికలలో బాల్య వివాహాల వలన జరుగుతున్న అనర్థాలు, కష్టనష్టాలపై పూర్తి అవగాహన వచ్చిందని, అయితే ఇంకా కొంతమంది తల్లిదండ్రులు మూఢనమ్మకాలు, వరకట్నాలు, మంచి సంబంధాలు అంటూ చిన్న వయసులోనే తమ బాలికలకు వివాహం జరిపించేందుకు ఉత్సాహం చూపుతున్నారని ఆమె పేర్కొన్నారు. అందువల్ల అన్ని శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంగా కృషిచేసి బాల్య వివాహాలపై జరిగే అనర్థాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు బాల్య వివాహాలు జరిగే సమాచారాన్ని కనీసం రోజుల ముందే తెలుసుకొని అధికారులకు తెలియజేయగలిగితే సత్ఫలితాలు సాధించవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే తల్లిదండ్రులు, బంధువులు, పురోహితులు తదితర వారికి జరిమానాలు, శిక్షలు కఠినతరం చేయాలని విద్య భవాని కోరారు.

## ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకూడదు

మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 29**

వేసవిలో తాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం నాడు తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో నీటి సరఫరా వివరాలు, సమస్యలు అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. టంగుటూరు, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పైప్ లైన్ ద్వారా నీటి సరఫరాకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని చెప్పారు. ఏ ఒక్క గ్రామంలో త్రాగునీటి సమస్య ఉండకూడదన్నారు. నీటి సరఫరాకు ఎక్కడైనా సమస్యలు తలెత్తితే అధికారులు అందుబాటులో ఉండి వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. పొలాల్లో పశువులకు నీరందించే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి అన్నారు.

## ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో డాక్టర్ పి సుజాత






**పొన్నలూరు పెన్ పవర్ ఏప్రిల్ 29**

మండల కేంద్రమైన పొన్నలూరులో మంగళవారం ఎంపీడీవో డాక్టర్ సుజాత ఉపాధి హామీ పనులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఉపాధి కల్పించే పథకం పర్యవేక్షణ పనుల అమలు, కూలీలు సరిగా పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు లేదో, పనులను నాణ్యతను మరియు కూలీల హాజరు ,పనిచేసిన గంటలు ,వేతనాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని అలాగే వేసవికాలం కాబట్టి కూలీలందరూ ఎక్కువగా నీరు తాగాలని, పనులకు సకాలంలో వచ్చి వారి పనులు నిర్వహించుకోవాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుధాకర్ ఈ సి కోటేశ్వరరావు టి ఏ కుమార్ ఫీల్డ్ అసిస్టెంట్ ఆదాము మరియు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## తెలుగుజాతి ప్రతీక, ఆత్మగౌరవం అమరావతి

**– చరిత్రలో నిలిచేలా ప్రధానికి స్వాగతం – రాజధాని కోసం ఇంటికొకరు కదలిరండి**

**– ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిలదీశారు – మీ పోరాటం ఐక్యత వృధా కాలేదు**

**– రాష్ట్ర పునర్నిర్మాణానికి సీఎం అడుగులు – తాడికొండ సభలో ఎమ్మెల్యే ఏలూరి**



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 29**

అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవం... ఆత్మగౌరవ ప్రతీక అని అమరావతి కోసం మీరు చేసిన త్యాగం వృధా కాలేదని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రధాని మోదీ పర్యటన విజయవంతం కోసం అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం సందర్భంగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి నియోజకవర్గ పరిశీలకులుగా ఎమ్మెల్యే ఏలూరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి విచ్చేయుచున్న ప్రధాని నరేంద్ర మోడీకి అఖండ స్వాగతం పలికాలని పిలుపునిచ్చారు. ఈ మహా యజ్ఞానికి ఇంటికి ఒకరు చొప్పున కదిలి వచ్చి ప్రధానికి జేజేలు పలకాలన్నారు. రాక్షస పాలనలో రాజధాని కోసం మీరు పోరాడిన తీరు అమోఘం అన్నారు. మొక్కవోని దీక్షతో ఐక్యంగా రాజధాని అమరావతి కోసం అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యద్భుత ఆలోచనలు ప్రతిభ ముందు చూపుతో మళ్లీ రాజధాని పునర్మాణానికి పూనుకున్నారని పేర్కొన్నారు. భావితరాల బంగారు భవిష్యత్తు కోసం చంద్రన్న చేస్తున్న యజ్ఞానికి అందరూ కలిసి రావాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి మళ్లీ దొంగలు ముష్కరులు సైకోలు ప్రయత్నిస్తున్నారని వారికి బుద్ధి చెప్పే విధంగా ప్రధానమంత్రి మోదీ కి స్వాగతం పలకాలన్నారు. గత ఐదేళ్లలో జగన్ అమరావతి రాజధాని నిర్మాణ పనులు ఆపివేసి రాష్ట్ర అభివృద్ధి అడ్డుకున్నాడని ధ్వజమెత్తారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి కి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం తో రాష్ట్ర అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోడీకి పలికే స్వాగతం దేశ చరిత్రలో నిలిచేలా ఉండాలన్నారు. ప్రపంచం మొత్తం అమరావతి వైపు చూసేలా చంద్రన్న అమరావతిని రూపుదిద్దనున్నారని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు.



# గురు, శిష్యుల ఎదురు చూపులు

**గుంటూరు, ఏప్రిల్ 29, పెన్ పవర్:** టీడీపీలో సీనియర్ నేతలకు చోటు దక్కే అవకాశం లేదు. ఇకపై అందరూ యువకులే ముందుండి పాలిటిక్స్ ను నడపాలని సైకిల్ పార్టీ అధినాయకత్వం భావిస్తుంది. అందుకే చాలా మంది సీనియర్లు టీడీపీలో పదవులు రాక కేవలం పార్టీ పదవులకే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాంటిది పార్టీలు మారి వచ్చిన వాళ్లని అసలు ఎందుకు నమ్ముతారు? ఎందుకు చేరదీస్తారు? వాళ్లేమీ స్వతహాగా ఓటు బ్యాంకు ఉన్న నేతలు కాదు. అలాగే స్వయంప్రకాశిత నేతలు కూడా కాదు. అలాంటి వారిని ఎందుకు కేర్ చేస్తారు. అలాంటిది వయసుడిగిపోయి, పార్టీలు మారి.. మారి వచ్చిన వాళ్లను టీడీపీ నాయకత్వం ఎందుకు దగ్గరకు తీసుకుంటుంది.సీనియర్ నేతకు కష్టాలే... ఆంధ్రప్రదేశ్ లో సీనియర్ నేత డొక్కా మాణిక్యవరప్రసాద్ రాజకీయ పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. ఉన్న సీనియర్ నేతలకే చోటు చిక్కడం లేదు. పట్టు లేదు. ఇప్పుడు పార్టీలు మారి వచ్చిన డొక్కా మాణిక్యవరప్రసాద్ ను అసలు టీడీపీ అధినాయకత్వం ఎందుకు కేర్ చేస్తుంది? అవును.. అసలు ఆయన ఏ నియోజకవర్గంలోనూ ప్రభావం చేయగల నేత కాదు అని అందరికీ తెలుసు. ఏదో గాలి వాటున, సామాజికవర్గం కోణంలో పదవులు పొందారే తప్ప ఆయనకు పట్టున్న ప్రాంతం కూడా ఏదీ లేదు. ఆ విషయం తెలిసిన టీడీపీ నాయకత్వం ఇప్పుడు మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ను దూరం పెట్టినట్లు తెలిసింది. ఆయన ఎంత గింజుకున్నా పదవి దక్కే అవకాశం లేదంటునారు. గుంటూరు జిల్లాలో ఒకప్పుడు రాయపాటి సాంబశివరావు హవా నడిచేది. రాయపాటి సాంబశివరావు శిష్యుడిగా డొక్కా మాణిక్యవరప్రసాద్ రాజకీయంగా ఎదిగారు. కాంగ్రెస్ హయాంలో మంత్రి పదవిని కూడా దక్కించుకున్నారు. 20024, 2009 లో వరసగా తాడికొండ నియోజకవర్గం నుంచి వరసగా గెలిచారు. అది కూడా నాటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హవాలోనే డొక్కా మాణిక్యవరప్రసాద్ గెలిచారన్నది అక్షర




సత్యం. అదే సమయంలో 2009లో మంత్రి పదవి కూడా దక్కించుకున్నారు. రాష్ట్ర విభజన ఆయన కొంపముంచిందనే చెప్పాలి. పోటీ చేయడానికి నియోజకవర్గమే దొరకలేదు. కాంగ్రెస్ లో కొంత కాలం ఉండి తర్వాత టీడీపీలో చేరారు. 2019లో టీడీపీ పత్తిపాడు టిక్కెట్ దక్కించుకున్నా నాటి జగన్ హవాలో ఓటమిని మూటగట్టుకున్నారు. వైసీపీ అధికారంలోకి రావడంతో టీడీపీని వీడి వైసీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. ఎప్పుడైనా జరగొచ్చట ఎటు అధికారం ఉంటే అటు... అంతటితో ఊరుకున్నారా? అంటే లేదు. 2024లో మళ్లీ అధికారం టీడీపీకి రావడంతో వైసీపీలో ఎమ్మెల్సీగా ఉన్న డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిపోయారు. దీంతో ఆయన పొలిటికల్ గ్రాఫ్ చిన్న పిల్లాడికి కూడా అర్థమయింది. ఎటు అధికారం ఉంటే అటు అడుగులు వేసే డొక్కా మాణిక్యవరప్రసాద్ ను

ఇప్పుడు ఎటు కాకుండా పోయారు. టీడీపీలో చేరినా ఆయనకు ప్రయారిటీ లేదు. పైగా ఉన్న సీనియర్ నేతలను పక్కన పెడుతున్న టీడీపీ నాయకత్వం ఇంతోటి నేతకు ఎందుకు ప్రయారిటీ ఇస్తుంది? అందుకే డొక్కా మాణిక్య వరప్రసాద్ రెండు ఎన్నికల్లో విజయంతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఆయన రాజకీయంగా రాయపాటి తో పిచ్చాపాటి మాట్లాడుకోవడం మినహా ప్రస్తుతమున్న పరిస్థితుల్లో చేయగలిగిందేమీ లేదు. భవిష్యత్ కూడా కనుచూపు మేరల్లో కనిపించడం లేదు.

# ఇప్పుడు సజ్జలే టార్గెట్టా...



**విజయవాడ, ఏప్రిల్ 29, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరసగా అరెస్ట్ లు జరుగుతున్నాయి. ఐపీఎస్ లతో పాటు రాజకీయ నేతలు కూడా ఇప్పటికే జైలుకు వెళుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తమను ఇబ్బందులు పెట్టిన వారిపై పాత కేసులు తోడి మరీ లోపలికి పంపుతున్నారు. వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి, నందిగం సురేష్ తో పాటు తాజాగా ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు ఇలా ఒక్కొక్కరు కీలక నేతలు జైలుకు వెళ్లి వస్తున్నారు. వీరిలో కొందరు జైలుకు వెళ్లి బెయిల్ పై బయటకు రాగా, మరికొందరు జైళ్లలోనే మగ్గుతున్నారు. అయినా సరే.. గతంలో కీలకంగా మారిన వారందరిపైనా వరస కేసులు నమోదవుతుండటంతో ఇప్పుడు అందరి వేళ్లూ సజ్జల రామకృష్ణారెడ్డి వైపు చూపుతున్నాయి.. సజ్జల రామకృష్ణారెడ్డి గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ఆయనకు అప్పటి విపక్షాలు సకల శాఖ మంత్రిగా కూడా పేరు పెట్టారు. ప్రధానంగా హోం శాఖను ఆయన చెప్పుచేతల్లో ఉంచుకుని మరీ నాడు టీడీపీ నేతలను, కార్యకర్తలపై కేసులు పెట్టడమే కాకుండా, సాక్షాత్తూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు యాభై మూడు రోజుల పాటు రాజమండ్రి జైల్లో ఉండటానికి కూడా సజ్జల డైరెక్షన్ అని టీడీపీ నేతలు బలంగా నమ్ముతున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ స్కిల్ డెవలెప్ మెంట్ స్కామ్ ను బయటకు తీసుకు వచ్చి నాడు సీఐడీ, ఇతర పోలీసు అధికారులతో మాట్లాడి చంద్రబాబు అరెస్ట్ వెనక సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారని టీడీపీ అగ్రనేతలే భావిస్తున్నారు కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటి వరకూ సజ్జల రామకృష్ణారెడ్డి పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియాలో తెలుగు తమ్ముళ్లే నిరసనను వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వ పెద్దలకు కూడా సజ్జల రామకృష్ణారెడ్డి విషయంలో ఏమీ చేయలేకపోతున్నామన్న బాధ కనిపిస్తుంది. అయితే చట్టప్రకారంగా, అన్ని ఆధారాలను సేకరించిన తర్వాతనే ముందుకు వెళితేనే న్యాయస్థానాల్లో కూడా సజ్జలకు వెసులుబాటు లభించదన్న అంచనాలతో అధికారులు చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి కూటమి పార్టీలకు కొరకరాని కొయ్యగా మారిన తరుణంలో ఆయన అరెస్ట్ ఎప్పుడు అన్నది ప్రతి రోజూ సోషల్ మీడియాలో టాపిక్ గానే మారింది. కొసరు నేతలకు కోరి పదవులు ఇస్తారా ఏంది? బలమైన చట్టం ఉన్న... అదే సమయంలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై నమోదవుతాయన్న కేసుల విషయంలో ముందస్తు బెయిల్ ను న్యాయస్థానం నుంచి తెచ్చుకుని కొంత ఊరట చెందుతున్నారు. అయితే తాజాగా సజ్జల రామకృష్ణారెడ్డి చుట్టూ ఉచ్చు బిగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అటవీ భూముల ఆక్రమణలో సజ్జల కుటుంబం ప్రమేయం ఉందని అధికారులు దాదాపు నిర్ధారణకు వచ్చారు. అటవీ శాఖ చట్టాలు చాలా బలంగా ఉంటాయి. అందుకే సజ్జల రామకృష్ణారెడ్డిని ఈ కేసులో అరెస్ట్ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగు రిజర్వు ఫారెస్ట్ లో అడవిని నరికి అడ్డంగా సజ్జల ఫ్యామిలీ దున్నేసిందన్న ఆరోపణలున్నాయి. అరవై ఎకరాల ఫారెస్ట్ భూమి ఆక్రమించారంటూ అటవీ, రెవెన్యూ శాఖల నివేదిక కూడా ఇవ్వడంతో ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డిని ఎప్పుడైనా అరెస్ట్ చేసే అవకాశముందన్న వార్తలు వస్తున్నాయి. యాభై ఎకరాలు ఆక్రమణకు గురైందని అటవీశాఖ చెప్పడంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు లోతుగా సర్వే చేసి పూర్తి స్థాయిలో కేసులు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

# పవన్ ట్యూన్ అయిపోయారే..

**విజయవాడ, ఏప్రిల్ 29, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం కానీ అసలు విషయం బోధపడలేదు. అంతకు ముందు పాలనతో పాటు సంక్షేమ పథకాలపైనే మాత్రం కాకుండా శాంతి భద్రతలు వంటి అంశాలపై కూడా ఊగిపోతూ ప్రసంగాలు చేసిన జనసేనానికి అధికారంలో ఉంటే తప్ప అర్థం కావడం లేదు. పరిమితులు, చట్టప్రకారం తీసుకోవాల్సిన చర్యలతో పాటు తాను సులువుగా చేయాలని భావించిన సమస్యలను పరిష్కరించడం అంత తేలిక కాదని గుర్తించారు. అందుకే ఆయన ఈ మధ్య కాలంలో అంటే దాదాపు పదినెలల నుంచి మౌనంగానే ఎక్కువగా ఉంటున్నారు. ఈ పరిస్థితి పవన్ కల్యాణ్ పై పెట్టుకున్న ఆశలు, ఎన్నికలకు ముందు ఉన్న ఇమేజ్ చాలా వరకూ తగ్గినట్లయింది సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే ఖజానాలో డబ్బులు కావు. డబ్బులు ఊరికే రావని అర్థమయింది. అలాగే అప్పులు కూడా అంత తేలిగ్గా పుట్టవని కూడా తెలిసింది. అధికారంలోకి వస్తే అది చేస్తాం, ఇది చేస్తామని చెప్పినా తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం అంత సులువు కాదని అర్థం కావడం వల్లనే పవన్ కల్యాణ్ ఎక్కువగా మౌనాన్ని ఆశ్రయించారంటున్నారు. పవన్ కల్యాణ్ జనసేన పార్టీని పెట్టి పదేళ్లు దాటి పోయినా ఆయనకు మొన్నటి వరకూ ఒక క్లీన్ ఇమేజ్ ఉండేది. పవన్ కల్యాణ్ అధికారంలోకి వస్తే ఏదో చేస్తారన్న నమ్మకం ఇటు



కాపు సామాజికవర్గంలోనూ, అటు పార్టీ క్యాడర్ లోనూ బలంగా ఉండేది. ఇచ్చిన మాట ఖచ్చితంగా అమలు చేస్తారని, పవన్ మాట తప్పరని భావించేవారు కానీ ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలను చేపట్టిన తర్వాత కూడా ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతున్నారన్న బాధ ఎక్కువగా ఉంది. అదే సమయంలో టీడీపీ నుంచి పదవులను రాబట్టుకోవడంలోనూ కొంత వెనకబడి ఉన్నారని జనసేన నేతలు అంటున్నారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీదే పై చేయి అయినప్పటికీ పట్టుబట్టి సాధించుకునే తత్వాన్ని పవన్ కల్యాణ్ కోల్పోయినట్లు కనిపిస్తుందని సొంత పార్టీ నేతలే అంటున్నారు. అందుకే పది నెలలు దాటుతున్నా ఇప్పటి వరకూ ముఖ్య నేతలకు నామినేటెడ్ పదవులు కానీ, మరో కీలకమైన పదవులు కానీ లభించడం లేదని వాపోతున్నారు. ఇలాగే కొనసాగితే తాము నమ్ముకుని పార్టీలో ఉన్నందుకు పవన్ కల్యాణ్ ఇలా రాజీపడి తమను ఇబ్బంది పెడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడైనా జరగొచ్చట అధికారంలోకి వచ్చిన తర్వాతే... అయితే పవన్ కల్యాణ్ కు అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మొత్తం అర్థమయిందని, ఆయన అంతా తెలుసుకున్న తర్వాత మాత్రమే అనుభం కలిగిన నేత చంద్రబాబు డైరెక్షన్ లోనే వెళ్లడం మంచిదని ఆయన భావిస్తున్నారని జనసేన ముఖ్యనేతలు కొందరు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించగలిగేది చంద్రబాబు మాత్రమేనని గట్టిగా నమ్మిన పవన్ కల్యాణ్ అందుకు అనుగుణంగా ట్యూన్ అయిపోయారని, మనం ఇబ్బంది పెట్టినా ప్రయోజనం లేదని గ్రహించిన తర్వాతనే మౌనంగా ఉంటున్నారని చెబుతున్నారు. అయితే బయట ఉన్న వారికి మాత్రం పవన్ కల్యాణ్ పూర్తిగా ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయారని అంటున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ కు అధికారంలోకి వచ్చిన తర్వాత కానీ అసలు విషయం అర్థం కాలేదన్నది మాత్రం వాస్తవం.

# కౌన్సిలర్ నుంచి పెద్దల సభ వరకు...

**ఏలూరు, ఏప్రిల్ 29, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో ఖాళీగా ఉన్న ఒక్క రాజ్యసభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పాకా వెంకట సత్యనారాయణ పేరు ఖరారు చేశారు. ప్రస్తుతం ఆయన ఏపీ బీజేపీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ గా ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన పేరు కూడా తెరపైకి వచ్చింది. అయితే అనూహ్యంగా ఆ స్థానం సోము వీర్రాజు దక్కించుకున్నారు. ఇప్పుడు అదే ప్రాంతానికి చెందిన నేతకు రాజ్యసభ సీటు కేటాయించారు.వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా ఉన్న విజయసాయిరెడ్డి రాజీనామా చేయడంతో ఈ ఉపఎన్నిక వచ్చింది. మరో నాలుగేళ్ల వరకూ పదవి కాలం ఉన్న స్థానం కావడంతో ఎవరికి లభిస్తుందో అన్న చర్చ ప్రారంభమయింది. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డికి అవకాశం కల్పిస్తారని అనుకున్నారు. అయితే రాను రాను ఆయన పేరు వెనుకబడిపోయింది. తమిళనాడు రాజకీయ పరిణామాల రీత్యా.. అన్నామలైను ఏపీ నుంచి రాజ్యసభకు పంపి.. కేంద్ర మంత్రిని చేస్తారని అనుకున్నారు . అలాగే స్మృతి ఇరానీ పేరు కూడా పరిశీలనకు వచ్చింది. కానీ .. చివరికి స్థానిక నేత అయిన పాకా వెంకట సత్యనారాయణకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. వర్గాలకు పార్టీ అవకాశం కల్పించిందని ఆ పార్టీ నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదవులన్నీ ఒకే ప్రాంతానికి కేటాయిస్తూ ఉండటంతో బీజేపీలోని ఇతర ప్రాంత నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. విజయసాయిరెడ్డి రాజీనామాతో ఏర్పడిన ఖాళీపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే బీజేపీ కోటా నుంచి భర్తీ అని తేలటంతో వారు ఆశలు వదులుకున్నారు. ఈ స్థానం నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేరును ఇటీవల అమిత్ షా కు సీఎం చంద్రబాబు సిఫార్సు చేసినట్లుగా తెలిసింది. ఇక, రేసులో అన్నామలై, స్మృతి ఇరానీ పేర్లూ వినిపించాయి. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు పోటీ చేస్తారని ప్రచారం జరిగినా.. అనూహ్యంగా పాక వెంకట సత్యనారాయణ పేరు కూటమి అభ్యర్థిగా ఖరారైంది.కేంద్రమంత్రి కూడా గోదావరి జిల్లాలకు చెందిన వారే. కూటమిలో భాగంగా వచ్చిన ఎమ్మెల్సీ, రాజ్యసభ కూడా అదే ప్రాంతానికి ఇచ్చారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు కూడా సాంకేతికంగా అదే ప్రాంతానికి చెందినట్లు .రాయలసీమ నేతల్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి ఆ ప్రాంతానికి ఇచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురందేశ్వరి ఉన్నారు. ఆమె స్థానంలో ఇతరుల్ని నియమిస్తారన్న ప్రచారం జరుగుతోంది.

# కారులో వచ్చి మరీ దొంగతనాలు

**కాకినాడ, ఏప్రిల్ 29, పెన్ పవర్:** వేసవి కాలంలో పిల్లలకు సెలవులు కావడంతో చాలా మంది విహార యాత్రలకు వెళ్తుంటారు. లేదా చుట్టాల ఇళ్లకు వెళ్తుంటారు. సరిగ్గా ఇదే సమయం కోసం ఎదురు చూస్తారు.. పక్కా ప్లానింగ్‌తో రెక్కీ నిర్వహిస్తారు.. తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తారు.. తాళాలు పగుల కొట్టడం, తాళం తీయకుండానే బోల్టులు విప్పడం, అంతా ఇంట్లో నిద్రిస్తున్న సమమంలోనే లోపలకు వెళ్లకుండానే కిటికీల గూండా గుట్టు చప్పుడు కాకుండా తళుపులు తీయడం లో సిద్ధ హస్తులు.. పని ముగించుకున్నాక వారు వేసుకొచ్చిన కారు ఎక్కడ పార్కింగ్ చేశారో అక్కడకు వెళ్లి దోచుకున్న నగలు, నగదుతో జారుకుంటారు.. ఇలా అనేక ఇళ్లకు కన్నం వేసి అంతరాష్ట్ర ముఠా ఒకటి అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసులకు చిక్కింది.. తెలుగు రాష్ట్రాల్లో 32 చోరీలు చేసిన అంతర్రాష్ట్ర దొంగలు ముఠాను కోనసీమ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు.. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా అమలాపురం పట్టణంలో 2023, 2024, 2025 సంవత్సరాల్లో చోరీలు చేసిన ముగ్గురు దొంగలను అమలాపురం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 40 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశారు. అమలాపురం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి. కృష్ణారావు విలేకర్ల సమావేశంలో చోరీల చిట్టాను వివరించారు. వీరి నుంచి రూ.40 లక్షల విలువైన 400 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి వస్తువులు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో తాము దొంగిలించిన సొత్తును నగుదుగా మార్చుతున్న సమయంలో అమలాపురం పట్టణ పోలీసులు ఆదివారం ఉదయం ఆరెస్ట్ చేశారు. జిల్లా ఏఎస్పీ ఏవీఆర్పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి. వీరబాబుతో కలసి ఎస్పీ కృష్ణారావు ఈ చోరీల వివరాలను వెల్లడించారు.పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు. అదే జిల్లా రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా శ్రీరామ నగర్‌కు చెందిన కాట్ల కిషోర్ బాబు ఓ ముఠాగా ఏర్పడ్డారు.. గత అయిదేళ్లుగా వీరు తెలుగు రాష్ట్రాల్లో అనేక చోరీలు చేసినట్లు పోలీసులు తెలిపారు. విలాస వంతమైన జీవితానికి అలవాటుపడ్డ వీరు ముగ్గురు కారులో తిరుగుతూ సమీపంలోని లాడ్జీల్లో దిగి ఆపై కారుపై రాత్రివేళల్లో బయలుదేరి దొంగతనాలు చేస్తుంటారని పోలీసులు తెలిపారు. పగటి పూట వీళ్లు టార్గెట్ చేసుకున్న ప్రాంతంలో రెక్కీ నిర్వహించి ఆపై కారులోనే తిరుగుతారు. లేదా సమీపంలో ఎక్కడైనా పార్కింగ్‌చేసి ఆపై నడుచుకుంటూ తిరిగి రెక్కీ నిర్వహించి టార్గెట్‌ను నిర్ణయించుకుంటారు. ఆపై ఆక్కడి నుంచి వెళ్లిపోయి తిరిగి కారులోనే తిరిగి వచ్చి సమీపంలోనే ఎక్కడైనా పార్కింగ్‌చేస్తారు. ఆపై తాళాలు గుట్టుచప్పుడు కాకుండా తీసి ఆపై దోచుకుని వారు వచ్చిన కారులోనే వెళ్లిపోతారు. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ, నల్గొండ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డ వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 17 చోరీలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 15 చోరీలకు పాల్పడ్డారు. మొత్తం 32 చోరీ కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారు. అమలాపురం పట్టణం గాంధీనగర్ 2023 ఏప్రిల్లో మొదటి చోరీ, కురసాలవారివీధిలో 2024 ఆగస్టులో రెండో చోరీ, ఈ సంవత్సరం జనవరిలో మూడో చోరీ చేశారు. ఈ మూడు చోరీలకు సంబంధించి రూ.40 లక్షల సొత్తును రికవరీ చేశారు. నరసరావుపేటలో క్రికెట్ ఆటలో ఈ ముగ్గురికి పరిచయం ఏర్పడింది. కేసును ఛేదించిన పోలీసులకు నగదు రివార్డులు ఈ మూడు చోరీ కేసులను చాకచక్యంగా ఛేదించిన పోలీసు అధికారులు, క్రైమ్ పార్టీ సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు అభినందించారు. వారికి నగదు రివార్డులు అందజేశారు. పట్టణ సీఐ పి. వీరబాబు, క్రైమ్ సీఐ ఎం గజేంద్రకుమార్, పట్టణ ఎస్ ఎన్ఆర్ కిషోర్బాబు, క్రైమ్ ఎస్సై రాంబాబు, ఏఎస్సై అయితాబత్తుల బాల కృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు ఎంఎస్ రాజు, రమణ, కాని సాయి, శుభాకర్, ప్రసాద్, శ్రీనివాస్, అర్జున్, హరి, చిన్న ప్రసాద్ కు ఎప్పీ కృష్ణారావు నగదు రివార్డులు అందజేసి అభినందించారు.

# సింగిల్ టైమ్ సెటిల్ మెంట్ లే ఔట్లు



**కర్నూలు, ఏప్రిల్ 29, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అనుమతులు లేని పాత లేఅవుట్లకు అనుమతులు పునరుద్ధరించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయం ద్వారా వివిధ పట్టణాభివృద్ధి సంస్థల నుంచి 15 నుంచి 20 ఏళ్ల క్రితం అనుమతులు తీసుకుని, గడువులోగా పనులు పూర్తిచేయని 870 లేఅవుట్లకు అనుమతులు మంజూరు చేయనున్నారు. ఇందులో అమరావతి పరిధిలోనే ఎక్కువ లేఅవుట్లు ఉన్నాయి. సీఆర్డీఏ పరిధిలో 624 లేఅవుట్లు, వీఎంఆర్డీఏ పరిధిలో 182 లేఅవుట్లు ఉన్నాయి.అలాగే కర్నూలు, తిరుపతి, శ్రీకాకుళం, పుట్టపర్తి వంటి చోట్ల మిగతా లేఅవుట్లు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయంతో ఈ లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన సుమారుగా 85 వేల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. ఇంటి నిర్మాణం కోసం గతంలో స్థలాలు కొనుగోలు చేసినప్పటికీ.. లేఅవుట్లకు పర్మిషన్లు లేకపోవటంతో అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అలాంటి వారికి ప్రయోజనం కలగనుంది.లేఅవుట్ల అభివృద్ధి కోసం అనుమతులు తీసుకున్న తర్వాత.. మూడేళ్లలోగా నిర్దేశించిన పనులు పూర్తి చేయాలి. లేఅవుట్లలో రోడ్లు, కాలువల నిర్మాణంతో పాటుగా లైట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ఈ సదుపాయాలన్నీ కల్పించిన తర్వాతే.. మార్ట్‌గేజ్ పెట్టిన ప్లాట్లను పట్టణాభివృద్ధి సంస్థలు విడుదల చేస్తాయి. అయితే ఏపీలో 870 లేఅవుట్లకు పర్మిషన్లు తీసుకున్నా కూడా.. గడువులోగా పనులు పూర్తి చేయలేదు. ఈ 870 లేఅవుట్లలో 85 వేల వరకూ ప్లాట్లు ఉన్నాయి. అయితే పనులు పూర్తి చేయకపోవటంతో మూడేళ్ల తర్వాత ఈ లేఅవుట్ల పర్మిషన్లు రద్దు అయ్యాయి. అయితే మరోసారి ఫీజులు కట్టి పర్మిష్లు పునరుద్ధరించుకునే అవకాశం ఉన్నప్పటికీ.. భారీగా ఫీజులు, డెవలప్‌మెంట్ ఛార్జీలు సైతం చెల్లించాల్సి ఉండటంతో వ్యాపారులు ముందుకురాలేదు. దీంతో ఈ లేఅవుట్లలోని 85 వేల ప్లాట్లను కొన్న కుటుంబాలు ఇబ్బందులకు గురయ్యా.యి.అనుమతిలేని ప్లాట్లలో ఇళ్లు కట్టుకోవడానికి అధికారులు అనుమతించలేదు. అలాగే బ్యాంకుల్లో రుణం తీసుకోవటానికి ఎల్‌పీ నంబర్ లేకపోవటంతో.. బ్యాంకు అధికారులు ఒప్పుకోలేదు. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద అనుమతులు పునరుద్ధరించుకునే అవకాశం కల్పించింది. అలాగే డెవలప్‌మెంట్ ఛార్జీలను సైతం మినహాయించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రభుత్వ అధికారులు సూచిస్తున్నారు.

# 14 ఏళ్లకే 15 రికార్డులు ఔట్.. వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేసిన రికార్డులివే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒక యువ క్రికెటర్ కు ఐపీఎల్ లో సెంచరీ కొట్టడమే పెద్ద కల. ఇక 35 బంతుల్లోనే ఆ ఘనతను సాధిస్తే అద్భుతం. అదే 14 ఏళ్ళ వయసులో ఈ ఫీట్ నమోదు చేస్తే అంతకంటే ఇంకో అద్భుతం ఉండదు. ఆడుతోంది ఐపీఎల్.. ప్రత్యర్థి జట్టులో అంతర్జాతీయ బౌలర్లు.. ఈ దశలో ఒక 14 ఏళ్ళ కుర్రాడు 35 బంతుల్లో సెంచరీ చేస్తాడని ఊహిస్తామా... కానీ రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. జైపూర్ లో సోమవారం (ఏప్రిల్ 28) గుజరాత్ టైటాన్స్ తో జరుగుతున్న మ్యాచ్ లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ టోర్నీలో బెస్ట్ బౌలింగ్ లైనప్ గా పేరున్న గుజరాత్ బౌలర్లకు చుక్కలు చూపించాడు.

మొదట 17 బంతుల్లో హాఫ్ సెంచరీ.. పూర్తి చేసుకున్న వైభవ్ ఆ తర్వాత కూడా అదే జోరును కొనసాగిస్తూ 35 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకొని ఐపీఎల్ లో సంచలనంగా మారాడు. కేవలం తన మూడో మ్యాచ్ లోనే 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకొని సంచలనం సృష్టించాడు. సూర్యవంశీ ఇన్నింగ్స్ లో 7 ఫోర్లతో పాటు ఏకంగా 11 సిక్సర్లున్నాయి. ఇషాంత్ శర్మ వేసిన నాలుగో ఓవర్లో ఏకంగా 28 పరుగులు రాబట్టి ఔరా అనిపించాడు.ఇక కరీం జనతా వేసిన 10 ఓవర్లో ఏకంగా 30 పరుగులు చేసి స్టేడియాన్ని హోరెత్తించాడు. తన సంచలన బ్యాటింగ్ తో వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేసిన రికార్డ్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.

1)ఐపీఎల్ లో హాఫ్ సెంచరీ చేసుకున్న పిన్న వయస్కుడు సూర్యవంశీ.. ఈ రికార్డ్ గతంలో రియాన్ పరాగ్ పేరిట ఉంది. 2019 లో పరాగ్ 17 ఏళ్ల 175 రోజులు వయసులో ఐపీఎల్ లో హాఫ్ సెంచరీ కొట్టటాడు.

2) మెన్స్ టీ20 క్రికెట్ లో హాఫ్ సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడు. 2022లో 15 సంవత్సరాల 360 రోజుల వయసులో హసన్ ఐసాఖిల్ (బూస్ట్ డిఫెండర్స్).. కాబూల్ ఈగల్స్ పై హాఫ్ సెంచరీ చేశాడు.

3) మెన్స్ టీ20 క్రికెట్ లో 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సులో సెంచరీ నమోదు చేసిన ఏకైక ప్లేయర్ సూర్యవంశీ.

4) ఐపీఎల్ లో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడు సూర్యవంశీ. అంతకముందు 2009 లో 19 ఏళ్ల 253 రోజుల వయసులో మనీష్ పాండే పేరిట ఈ రికార్డ్ ఉంది.

5) మెన్స్ %ు%20 క్రికెట్ లో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడు సూర్యవంశీ. 2013 లో 18 సంవత్సరాలు 118 రోజు వయసులో సెంచరీ చేసిన విజయ్ జోల్‌ను అధిగమించాడు. మహారాష్ట్ర ప్లేయర్ అయిన విజయ్ జోల్ ముంబైపై ఈ ఫీట్ సాధించాడు.

6) ఐపీఎల్ లో రెండో ఫాస్టెస్ట్ సెంచరీని నమోదు చేశాడు. 2013లో పూణే వారియర్స్ ఇండియాపై క్రిస్ గేల్ 30 బంతుల్లో సెంచరీ చేసిన రికార్డ్ ఇప్పటికీ చెక్కు చెదరలేదు.

7) ఐపీఎల్ లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఇండియన్స్ ప్లేయర్ గా వైభవ్ చరిత్ర సృష్టించాడు. 2010లో ముంబై ఇండియన్స్‌పై యూసుఫ్ పఠాన్ 37 బంతుల్లో సెంచరీ చేసి నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టాడు.

8) ఐపీఎల్ 2025 సీజన్ లో ఫాస్టెస్ట్ సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్‌పై ప్రియాంష్ ఆర్య 39 బంతుల్లో సెంచరీ చేసిన రికార్డును అధిగమించాడు,

9) గుజరాత్ టైటాన్స్ పై ఫాస్టెస్ట్ సెంచరీ చేశాడు. 2024లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆటగాడు గుజరాత్ పై విల్ జాక్స్ 41 బంతుల్లో చేసిన సెంచరీని అధిగమించాడు.

10) 11 సిక్సర్లతో ఐపీఎల్ లో ఒకే ఇన్నింగ్స్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ప్లేయర్ గా రికార్డ్ ను సమం చేశాడు. 2010 ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున రాజస్థాన్ రాయల్స్ పై మురళీ విజయ్ చేసిన 11 సిక్సర్ల రికార్డును సమం చేశాడు.

11) 11 సిక్సర్లతో ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సులు కొట్టిన అన్‌క్యాప్డ్ బ్యాట్స్‌మన్ – ఐపీఎల్ 2020లో ముంబై ఇండియన్స్ తరపున ఇషాన్ కిషన్ రాయల్ ఛాలెంజర్స్ పై కొట్టిన 9 సిక్సులు కొట్టిన రికార్డును అధిగమించాడు.

12) 11 సిక్సర్లతో ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున అత్యధిక సిక్సర్లు కొట్టిన ప్లేయర్ గా రికార్డ్ సృష్టించాడు. ఐపీఎల్ 2018లో రాయల్ ఛాలెంజర్స్ పై సంజు శాంసన్ కొట్టిన 10 సిక్సర్లను అధిగమించాడు.

13) ఐపీఎల్ సెంచరీలో అత్యధిక బౌండరీ శాతం వైభవ్ (93.07) పేరిట ఉంది. ఐపీఎల్ 2023 లో రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు యశస్వి జైస్వాల్ (90.32) బౌండరీ శాతాన్ని అధిగమించాడు.

14) ఐపీఎల్ చరిత్రలో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్న అతి పిన్న వయస్కుడైన క్రికెటర్ గా నిలిచాడు. అంతకముందు 17 ఏళ్ల 39 ఏళ్ల వయసున్న ముజీబ్ ఉర్ రెహమాన్ పేరిట ఉన్న రికార్డ్ ను అధిగమించాడు.

15) మెన్స్ %ు%20 చరిత్రలో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్న అతి పిన్న వయస్కుడైన క్రికెటర్. 15 సంవత్సరాల 74 సంవత్సరాల వయస్సులో అలుసిన్ తురేను వైభవ్ అధిగమించాడు.

## బ్రిట్స్ వణికించినా రాణా గెలిపించింది: సఫారీలపై
# టీమిండియా మహిళలు థ్రిల్లింగ్ విక్టరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** వన్డే ట్రై సిరీస్‌లో భారత మహిళల జట్టు వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. మంగళవారం (ఏప్రిల్ 29) సౌతాఫ్రికా మహిళలతో జరిగిన మ్యాచ్ లో 15 పరుగుల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. తొలి వికెట్ కు లారా వోల్వార్ట్, బ్రిట్స్ (107 బంతుల్లో 109: 13 ఫోర్లు, 3 సిక్సర్లు) ఏకంగా 140 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పినా.. ఆ తర్వాత భారత బౌలర్లు పుంజుకొని అద్భుతంగా రాణించారు. కొలంబోలో జరిగిన ఈ మ్యాచ్ లో స్నేహ రాణా 5 వికెట్లతో సత్తా చాటడంతో ఓడిపోయే మ్యాచ్ లో గెలుపు అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 49.2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. 277 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు అదిరిపోయే ఆరంభం లభించింది. తొలి వికెట్ కు వోల్వార్ట్, బ్రిట్స్ ఏకంగా 140 పరుగులు జోడించి జట్టును పటిష్ట స్థితిలో ఉంచారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని దీప్తి శర్మ విడగొట్టింది. 2 వికెట్ల నష్టానికి 181 పరుగులతో విజయం దిశగా వెళ్తున్న సఫారీలు ఒక్కసారిగా కుప్పకూలారు. స్పిన్నర్ స్నేహ రాణా ధాటికి వరుస విరామాల్లో వికెట్లను కోల్పోతూ వచ్చింది. ఒక ఎండ్ లో టాజ్మిన్ బ్రిట్స్ ఒంటరి పోరాటం చేసినా ఆమెకు మిగిలిన వారి నుంచి పెద్దగా సహకరించలేదు. 48 ఓవర్ చివరి బంతికి ఔట్ కావడంతో సౌతాఫ్రికా ఓటమి ఖరారైంది.

భారత బౌలర్లలో స్నేహ రాణా 5 వికెట్లు పడగొట్టింది. అరుంధతి రెడ్డి, చరని, దీప్తి శర్మ తలో వికెట్ తీసుకున్నారు. అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన భారత మహిళలు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ ప్రతీక రావల్ 78పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచింది. స్మృతి మంధన (36), హర్మాన్ ప్రీత్ కౌర్ (41), జెమీమా రోడ్రిగ్స్ (42) రాణించారు. ఏ టోర్నీలో తర్వాత మ్యాచ్ శ్రీలంక, సౌతాఫ్రికా జట్ల మధ్య గురువారం (మే 1) జరుగుతుంది.

# ఆరెక్స్ బ్యూటీ వాటితోనే సరిపెడుతుందిగా..?



సంయుక్త మీనన్ ఇలా లేచింది





ఇన్‌స్టాగ్రామ్ సాయి మంజ్రేకర్ యొక్క రాజ జాతి వైబ్‌లను ఇష్టపడుతుంది

బాలీవుడ్ లో సీరియల్స్ చేస్తూ ఉన్న భామని ఆరెక్స్ 100 తో టాలీవుడ్ కి పరిచయం చేశాడు డైరెక్టర్ అజయ్ భూపతి. పాయల్ రాజ్ పుత్ చేసిన ఆరెక్స్ 100 సినిమా సూపర్ హిట్ అయ్యింది. ఐతే పాయల్ కన్నా ముందు అజయ్ ఈ పాత్ర చేయాలని తెలుగులో అప్పటికే పాపులారిటీ సంపాదించిన కొందరు హీరోయిన్స్ ని అడిగాడు. కానీ వాళ్లంతా ఆ పాత్రని రిజెక్ట్ చేశారు. ఐతే పాయల్ మాత్రం ఇలాంటి సినిమాతో ఎంట్రీ బాగుంటుందని ఆలోచించి పిక్ చేసుకుంది.ఇక ఆరెక్స్ 100 సినిమా రిలీజ్ తర్వాత పాయల్ రాజ్ పుత్ టాలీవుడ్ లో మంచి క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమాలో హీరోయిన్ పాత్ర పాయల్ తప్ప వేరే ఎవరైనా నాట్ సూటబుల్ అనేలా చేసింది. ఐతే ఆరెక్స్ 100 తర్వాత పాయల్ కి మళ్లీ అదే తరహా పాత్రలు రావడం జరిగింది. ఐతే ఒకటి రెండు పర్వాలేదు కానీ తనని అందరు అలానే చూస్తున్నారని పాయల్ ఫీలైంది.కొన్ని సినిమాల్లో మంచి రోల్స్ పడినా అవి సరిగా ఆడకపోవడంతో అమ్మడు కెరీర్ లో వెనకపడింది. ఐతే మళ్లీ ఆరెక్స్ 100 డైరెక్టర్ అజయ్ భూపతితోనే మంగళవారం సినిమా చేసింది పాయల్ రాజ్ పుత్. ఆ సినిమాలో తన నటనతో మెస్మరైజ్ చేసింది అమ్మడు. అదేంటో పాయల్ లో కొత్త కోణాన్ని.. ఆమె లోని నటిని అజయ్ భూపతి మాత్రమే గొప్పగా చూపించగలుగుతున్నాడు. ఈ విషయంలో అజయ్ భూపతికి క్రెడిట్ ఇవ్వాల్సిందే.మంగళవారం సినిమాలో పాయల్ నటనతో ఇంప్రెస్ చేసింది. ఐతే ఆ తర్వాత మళ్లీ కెరీర్ ఊపందుకుంటుందని అనుకోగా పెద్దగా ఛాన్స్ లు రాలేదు. ఐతే పాయల్ ఫ్రీ టైం లో ఎక్కువగా ఫోటో షూట్స్ చేస్తూ కాలం వెళ్లదీస్తుంది. అమ్మడు ఈమధ్య కాలంలో సినిమాల్లో కన్నా ఫోటో షూట్స్ లోనే ఎక్కువ కనిపిస్తుంది. అది పాయల్ ఫ్యాన్స్ కి కాస్త అసంతృప్తిగా ఉంది. అఫ్కోర్స్ సిల్వర్ స్క్రీన్ మీద చేసే గ్లామర్ షో కన్నా ఫోటో షూట్స్ తోనే ఫాలోవర్స్ ఎక్కువ ఎంటర్టైన్ అవుతున్నారు. అయినా కూడా పాయల్ ని మళ్లీ తర మీద చూడాలని ఉత్సాహ పడుతున్నారు. మంగళవారం 2 ఉంటుందని న్యూస్ వినిపిస్తున్నా అందులో పాయల్ ఉంటుందా లేదా కొత్త హీరోయిన్ ని తీసుకొస్తారా అన్న డౌట్ ఉంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com